

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 09 అక్టోబరు 2021 సంపుటి : 03 సంచిక : 59 పేజీలు : 4 వెల : రూ 3-00


## పేదలకు భారం కాకుండా ఒక్క రూపాయికే టిడ్కో ఇల్లు: బొత్స

### నెల్లూరులో టిడ్కో ఇళ్లను ప్రారంభించిన మంత్రులు



నెల్లూరు: భగత్‌సింగ్ నగర్‌లో టిడ్కో ఇళ్లను మంత్రులు బొత్స సత్యనారాయణ, అనిల్‌కుమార్ యాదవ్ శుక్రవారం ప్రారంభించారు. 1000 మంది లబ్ధిదారులకు ఇంటి తాళాలను మంత్రులు అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ, రాష్ట్రంలో 2,62,000 టిడ్కో ఇళ్లు సిద్ధం చేశామని తెలిపారు. 18 నెలల్లో అన్ని చోట్లా టిడ్కో ఇళ్లు అందిస్తామన్నారు. గత ప్రభుత్వం పేదలపై భారం వేయాలని చూసిందని.. పేదలకు భారం కాకుండా ఒక్క రూపాయికే టిడ్కో ఇళ్లు అందిస్తున్నామని మంత్రి బొత్స అన్నారు. సీఎం జగన్ పాలనాదక్షతకు టిడ్కో ఇళ్ల ఏర్పాటు నిదర్శనమన్నారు. మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ, గత ప్రభుత్వం టిడ్కో ఇళ్లను అసంపూర్తిగా వదిలేసిందన్నారు. గత ప్రభుత్వం పేదల వద్ద డబ్బు కట్టించుకుని మోసం చేసిందన్నారు. పేదలపై భారం పడకూడదనే రూ. 7వేల కోట్లను ప్రభుత్వం భరిస్తోందని మంత్రి అనిల్ అన్నారు.

## ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకూడదు: సీఎం జగన్



తాడేపల్లి: అగ్రి ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రగతిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. రైతులకు మంచి ధర అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను సీఎం ఆదేశించారు. వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లలో పోటీని పెంచేలా చూడాలిదీనివల్ల రైతులకు మంచి ధర వస్తుందిధరల విషయంలో రైతులకు ఎక్కడ నిరాశాజనక పరిస్థితులు ఉన్నా వెంటనే మార్కెట్లో జోక్యం చేసుకోవాలిధరల స్థిరీకరణ నిధి ద్వారా రైతులను ఆదుకునే చర్యలను దూకుడుగా చేపట్టాలిఏ ఒక్క రైతుకు ఇబ్బంది రాకుండా చూడాలన్న సీఎంఅలాగే ఆర్బీకేల పనితీరును దేశవ్యాప్తంగా కొనియాడుతున్నారునాణ్యత ఉన్న ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు రైతులకు మంచి ధరలకే లభిస్తున్నాయిబయట మార్కెట్లో డీలర్ అమ్మే రేట్లకన్నా తక్కువ రేట్లకే లభిస్తున్నాయిరేట్లలో మోసం లేదు, క్వాలిటీలో మోసం లేదు :దేశంలో పరిస్థితులు ఎలా ఉన్నా.. రాష్ట్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకుంటున్నాంఆర్బీకేల్లో రైతులు ఆర్డర్లను ప్లేస్‌చేయగానే వాటిని వారికి అందించేలా చర్యలు తీసుకోవాలన్న సీఎంఅవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు తీసుకున్నాందీంట్లో భాగంగా పొటాష్‌ను కూడా తెప్పించుకున్నాంఇలాంటి ఆర్బీకేలపై కావాలనే కొందరు దుష్ప్రచారం చేస్తున్నారుఆర్బీకేల ద్వారా ఎమ్మార్పీ ధరలకే నాణ్యమైన సీడ్, ఫీడ్, ఎరువులు రైతులకు అందుబాటులోకి రావడం వారికి ఇష్టం లేనట్టుందిఅధిక ధరల్లో రైతులు చిక్కుకోవాలని, ఎరువులకోసం, విత్తనాల కోసం అప్పులు చేసి వడ్డీలు మీద వడ్డీలు చెల్లించే పరిస్థితులే కొనసాగాలన్నది వారి ఉద్దేశంగా కనిపిస్తోంది:ఇలాంటి పరిస్థితులకు అడ్డుకట్టవేస్తూ ఆర్బీకేలను తీసుకురావడం, వాటి ద్వారా రైతుల ముంగిటకే సేవలు అందించడం వారికి నచ్చడం లేదుసబ్ డీలర్లుగా ఆర్బీకేలు...మరో అడుగు ముందుకేసి ఆర్బీకేలను సబ్‌డీలర్లుగా మార్పు చేస్తున్నామన్న అధికారులువచ్చే రబీ సీజన్‌నుంచి ఇది అమల్లోకి వస్తోందన్న అధికారులురైతులకు మరింత మేలు జరుగుతుందన్న అధికారులు వరి అధికంగా సాగవుతున్న ప్రాంతాల్లో కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్న సీఎంబోర్ల కింద ప్రత్యామ్నాయ పంటలు బోర్ల కింద వరిని సాగుచేసే చోట ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలి: సీఎంమిల్లెట్స్‌తో పాటు ఇతర ప్రత్యామ్నాయ పంటలను సాగును ప్రోత్సహించాలన్న సీఎంప్రత్యామ్నాయ పంటలను సాగుచేసే రైతులకు ప్రోత్సాహకాలు కూడా ఇవ్వాలి33 చోట్ల సీడ్ కమ్ మిల్లెట్ ప్రాససింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపిన అధికారులుఈ డిసెంబరు నాటికి 20 యూనిట్లు అందుబాటులోకి వస్తాయన్న అధికారులు33 యూనిట్లను మార్చి 2022 కల్లా పూర్తి చేయడానికి లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్న అధికారులు వచ్చే ఖరీఫ్‌నాటికి పూర్తిగా అందుబాటులోకి వస్తాయన్న అధికారులుజగనన్న పాలవెల్లువ కార్యక్రమంపైనా సీఎం సమీక్షబీఎంసీల నిర్మాణంపై వివరాలు అందించిన అధికారులుప్రాధాన్యతా క్రమంలో గుర్తించిన బీఎంసీలను డిసెంబర్ నాటికి పూర్తిచేస్తామన్న అధికారులుజగనన్న పాలవెల్లువ కార్యక్రమం చేపట్టిన జిల్లాల్లో పాల సేకరణ అంతకంతకూ పెరుగుతోందన్న అధికారులుఇలాంటి కార్యక్రమంపైనా విషప్రచారానికి నానా ప్రయత్నాలు చేస్తున్నారుదీనివల్ల రైతులకు మేలు జరుగుతోంది:ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాట్లపై వివరాలడిగిన సీఎంఇప్పటివరకు జరిగిన ప్రగతిని నివేదించిన అధికారులు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలన్న సీఎం ఫిషింగ్ హార్బర్ల నిర్మాణంపైనా సీఎం సమీక్షజువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడలో పనులు జరగుతున్నాయన్న అధికారులుజులైలో పనులు దాదాపుగా పూర్తవుతాయన్న అధికారులు?మిగిలిన ఐదు ఫిషింగ్ హార్బర్ల పనులపైనా దృష్టిపెట్టాలన్న సీఎం ఈ సమీక్షా సమావేశానికి వ్యవసాయశాఖ మంత్రి కురసాల కన్నబాబు, వ్యవసాయశాఖ స్పెషల్ సీఎస్ పూనం మాల కొండయ్య, వ్యవసాయ మార్కెటింగ్ ముఖ్య కార్యదర్శి వై మధుసూధన్‌రెడ్డి, ఫుడ్ ప్రాససింగ్, పరిశ్రమలు, వాణిజ్యశాఖ కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా, ఆర్థిక శాఖ కార్యదర్శి ఎన్ గుల్జార్, ఏపీడీడీసీఎఫ్ లిమిటెడ్ ఎండీ ఎ బాబు, వ్యవసాయశాఖ కమిషనర్ హెచ్ అరుణ్‌కుమార్, అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిషనర్ పి ఎస్ ప్రద్యుమ్న, మత్స్యశాఖ కమిషనర్ కె కన్నబాబు, ఉద్యానవనశాఖ కమిషనర్ డాక్టర్ ఎస్ ఎస్ శ్రీధర్, సీడ్స్ కార్పొరేషన్ వీసీ అండ్ ఎండీ జి శేఖర్ బాబు, మారిటైం బోర్డు సీఈఓ కె మురళీధరన్ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## ఎక్కడా ఎరువుల కొరతలేదు: మంత్రి కన్నబాబు

### ప్రభుత్వ పనితీరుపై పచ్చ పత్రికల తప్పుడు ప్రచారం
### రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుపై దేశవ్యాప్తంగా ప్రశంసలు
### మంత్రి కురసాల కన్నబాబు




అమరావతి: వ్యవసాయ మౌలిక సదుపాయాలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్షించారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు తెలిపారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, రైతు భరోసా కేంద్రాల బలోపేతంపై సీఎం పలు ఆదేశాలిచ్చారన్నారు. ప్రభుత్వ పనితీరుపై పచ్చ పత్రికలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మంత్రి మండిపడ్డారు. రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుపై దేశవ్యాప్తంగా ప్రశంసలు వస్తున్నాయన్నారు. దళారీలను అరికట్టడానికే భరోసా కేంద్రాలు తీసుకొచ్చామన్నారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించడం ప్రథమ లక్ష్యమని తెలిపారు. ఎక్కడా ఎరువుల కొరత లేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి రైతు భరోసా కేంద్రం.. సబ్ డీలర్‌గా ఉంటుందన్నారు. రైతులను ఆదుకునేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నామన్నారు.

## మత్స్యకారుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం: పేర్ని నాని

కృష్ణా జిల్లా: మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్ని నాని అన్నారు. గన్నవరంలో 30 లక్షల వ్యయంతో నిర్మించిన మత్స్య సహకార నూతన భవనాన్ని ప్రారంభించిన మంత్రి పేర్ని నాని, ఎమ్మెల్యే వల్లభనేని వంశీ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారన్నారు. గుజరాత్‌లో డ్రగ్స్ కేసుల్ని ఏపీకి అంటగట్టేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారన్నారు. దసరాకు 4వేల ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని మంత్రి వెల్లడించారు. అధిక ధరలు వసూలు చేసే ప్రైవేట్ బస్సులపై చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. ఫిర్యాదుల కోసం త్వరలో ప్రత్యేక వాట్సాప్ నెంబర్ అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఆన్ లైన్ టిక్కెట్‌లపై ఎప్పటికప్పుడు ప్రత్యేక నిఘా పెట్టామని మంత్రి పేర్ని నాని తెలిపారు.



## ఈ నెల 11,12 తేదీల్లో సీఎం జగన్ తిరుమల పర్యటన

అమరావతి: ఈ నెల 11,12 తేదీల్లో తిరుపతి, తిరుమలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటించనున్నారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో సీఎం పాల్గొననున్నారు. సీఎం తిరుపతి బర్డ్ ఆసుపత్రిలో చిన్న పిల్లల గుండె ఆపరేషన్ల విభాగాన్ని సీఎం ప్రారంభించనున్నారు. అలిపిరి వద్ద గో మండపాన్ని సీఎం ప్రారంభించనున్నారు. అనంతరం బ్రహ్మోత్సవాల్లో పాల్గొని శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. 12న ఉదయం శ్రీవారిని సీఎం వైఎస్ జగన్ దర్శించుకోనున్నారు. అనంతరం ఎస్వీబీసీ కన్నడ,హిందీ ఛానళ్లను సీఎం ప్రారంభించనున్నారు. కొత్త బూందీపోటు భవనాన్ని సీఎం ప్రారంభించనున్నారు. అన్నమయ్య, భవన్‌లో టీటీడీ, ఏపీ రైతు సాధికార సంస్థ మధ్య ఎంవోయూ, టీటీడీ కొత్తగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను సీఎంకు అధికారులు వివరించనున్నారు.



## ఏపీలో కొత్తగా 693 కరోనా కేసులు



అమరావతి: రాష్ట్రంలోని కరోనా పరిస్థితులపై అధికారులు బులెటిన్ విడుదల చేసారు. తాజాగా ఏపీలో కొత్తగా 693 కరోనా కేసులు నమోదు అయ్యాయి. కరోనాతో ఆరుగురు మృతి చెందారు. ఇప్పటివరకు ఏపీలో 20,55,999కి చేరిన కరోనా కేసులు నమోదయ్యాయి. ఇప్పటివరకు కరోనాతో రాష్ట్రంలో 14,242 మరణాలు సంభవిం చాయి. ప్రస్తుతం ఏపీలో 8,310 యాక్టివ్ కేసులు ఉన్నాయి. కరోనా నుంచి 20,33,447 మంది రికవరీ చెందారు. కరోనాతో కృష్ణా జిల్లాలో ఇద్దరు మృతి చెందారు. అనంతపురం, చిత్తూరు, గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఒక్కరు చొప్పున మృతి చెందారు.

## హైకోర్టులో కౌలు పిటిషన్

అమరావతి: కొంతమంది రాజధాని రైతులకు కౌలు రాకపోవడంపై ఏపీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రైతుల తరపున న్యాయవాది వి.వి లక్ష్మీనారాయణ హైకోర్టులో పిటిషన్ వేశారు. నాలుగు వారాల్లోగా రైతులందరికీ కౌలు చెల్లించాలని హైకోర్టు ఆదేశించింది. కౌలు విడుదలకు సంబంధించి జీవో జారీ చేశామని ఏపీ ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. జీవో జారీ చేసినా కౌలు చెల్లించలేదని రైతుల తరపు న్యాయవాది లక్ష్మీనారాయణ చెప్పారు. 4 వారాల్లోగా కౌలు చెల్లించి నివేదిక సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది.




## ధూళిపాళ్లకు నోటీసులు ఎలా ఇస్తారు?: చినరాజప్ప



అమరావతి: ఏపీలో అంబెద్కర్ రాజ్యాంగం నడవడం లేదని, రాజారెడ్డి రాజ్యాంగం మాత్రమే నడుస్తోందని టీడీపీ నేత, మాజీ హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప విమర్శించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ డ్రగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని వదిలి.. ధూళిపాళ్లకు పోలీసులు ఎలా నోటీసులు ఇస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వ పాలన మొత్తం ప్రతిపక్షాలను ఎలా తొక్కాలి అనే పనిగా పెట్టుకుందన్నారు. ప్రజల పక్షాన ఉండే ప్రతిపక్షాల నోరు నొక్కే ప్రయత్నం వైసీపీ నేతలు చేస్తున్నారని మండిపడ్డారు. తప్పులు జరుతున్నాయి అంటే.. వాటిని అరికట్టకుండా సాక్షాలు ఇవ్వాలని పోలీసులు అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు ఎన్ఐఏ దర్యాప్తు ప్రారంభం కాక ముందే డ్రగ్స్‌తో ఏపీకి సంబంధం లేదని వైసీపీ నేతలు అంటున్నారని విమర్శించారు. నిబంధనలకు విరుద్ధంగా పోలీసులు వ్యవహరిస్తున్నారని చినరాజప్ప అన్నారు. ప్రతిపక్ష నేతలను భయభ్రాంతులకు గురి చేయడానికే ఇలాంటి నోటీసులు ఇస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రజల అందరూ డ్రగ్స్ గురించే మాట్లాడుతున్నారని, శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు. పోలీస్ యంత్రాంగానికి వైసీపీపై స్వామి భక్తి ఎక్కువైందని చినరాజప్ప ఎద్దేవా చేశారు.

## అలా చేయాలని టెస్లాను కోరాం : నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ : ఎలక్ట్రిక్ వెహికిల్స్‌ను భారత్‌లో తయారు చేయాలని, అందుకు అవసరమైన సహకారం అందిస్తామని అమెరికాకు చెందిన టెస్లాకు అనేకసార్లు చెప్పినట్లు, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ శుక్రవారం చెప్పారు. టాటా మోటార్స్ తయారు చేసే ఎలక్ట్రిక్ కార్లు టెస్లా ఎలక్ట్రిక్ కార్ల కన్నా తీసికట్టేమీ కాదన్నారు. ఓ జాతీయ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చైనాలో తయారు చేసిన ఎలక్ట్రిక్ కార్లను భారత దేశంలో అమ్మవద్దని, భారత దేశంలోనే ఎలక్ట్రిక్ కార్లను తయారు చేసి, భారత దేశం నుంచి ఎగుమతి చేయాలని టెస్లాకు అనేకసార్లు



చెప్పానని నితిన్ గడ్కరీ చెప్పారు. భారత దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల దిగుమతిపై సుంకాలను తగ్గించాలని టెస్లా డిమాండ్ చేసిందన్నారు. “మీకు (టెస్లాకు) ఎలాంటి సహకారం కావాలన్నా భారత ప్రభుత్వం అందిస్తుంది” అని తాను చెప్పానన్నారు. పన్ను రాయితీలకు సంబంధించిన డిమాండ్‌పై టెస్లా అధికారులతో తాను ఇప్పటికీ చర్చలు జరుపుతున్నానన్నారు. ఇదిలావుండగా భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ కూడా గత నెలలో టెస్లాకు ఓ విజ్ఞప్తి చేసింది. పన్ను రాయితీల గురించి పరిశీలించడానికి ముందు భారత దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల తయారీని ప్రారంభించాలని కోరింది. అంతకుముందు గడ్కరీ మాట్లాడుతూ, మన దేశంలో మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి టెస్లాకు సువర్ణావకాశం ఉందని చెప్పారు. మన దేశం ఎలక్ట్రిక్ వాహనాల కోసం ఎదురు చూస్తోందన్నారు. టెస్లా ఇప్పటికే ఇండియన్ ఆటోమేకర్స్ నుంచి ఆటో విడి భాగాలను తీసుకుంటోందని, ఓ యూనిట్‌ను ఇక్కడ ఏర్పాటు చేయడం వల్ల ఆ కంపెనీకి ఆర్థికంగా కలిసొస్తుందని తెలిపారు.

## జగన్‌పై విరుచుకుపడ్డ పీతల సుజాత

జంగారెడ్డిగూడెం (పశ్చిమగోదావరి జిల్లా): సీఎం జగన్‌పై మాజీమంత్రి పీతల సుజాత విరుచుకుపడ్డారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలనే ఉద్దేశ్యంతో 20 ఏళ్ల క్రితం మాజీ సీఎం చంద్రబాబు డ్వాక్రా సంఘాలను స్థాపించారని సుజాత తెలిపారు. డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలు శక్తివంతులయ్యారని గుర్తుచేశారు. తాను అధికారంలోకి వస్తే డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన సీఎం జగన్.. అధికారంలోకి వచ్చాక మాట తప్పారని సుజాత ధ్వజమెత్తారు. గతంలో డ్వాక్రా సంఘాలు రాజకీయాలకు అతీతంగా ఉండేవని చెప్పారు. అయితే వైసీపీ అధికారంలోకి



వచ్చాక డ్వాక్రా సంఘాలను కలుషితం చేశారని దుయ్యబట్టారు. రాజకీయ ఒత్తిడులతో అనేక ఆంక్షలు పెట్టి కొన్ని సంఘాలకు లబ్ది కలగకుండా చేశారని తప్పుబట్టారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజికవర్గాలకు చెందిన సబ్ ప్లాన్ నిధులను నేడు అసరా పేరుతో దారిమళ్లించి చెల్లిస్తున్నారని సుజాత విమర్శించారు.

# సంపాదకీయం

శనివారం 09 అక్టోబరు 2021

## తెరపైకి మళ్లీ ప్రత్యేక హోదా

బీహార్‌కు ప్రత్యేక హోదానివ్వాలన్న డిమాండ్‌తో పలుమార్లు అధికారాన్ని చేజిక్కించుకున్న జనతాదళ్ యునైటెడ్ (జెడియు) బాటలో ప్రతిపక్ష ఆర్జేడీ నడవనుంది. 2024 జరిగే లోక్‌సభ ఎన్నికల్లో దీనినే ప్రధాన డిమాండ్‌గా ముందుకు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తోంది. ప్రతిపక్ష ఆర్జేడీ నేతృత్వంలోని మహాఘట్బంధన్‌లోని వామపక్ష పార్టీలు సైతం ఈ డిమాండ్‌కు మద్దతు తెలిపాయి. 2005 నుండి ఇప్పటి వరకు కూడా బీహార్‌కు ప్రత్యేక హోదానివ్వాలంటూ ఇదే డిమాండ్ పట్టుకుని వేలాడిన నితీష్ కుమార్‌కు...ఇప్పుడు దీనికి స్వస్తి చెప్పడంతో.... మిగిలిన పార్టీలు ఈ డిమాండ్ తెరపైకి తీసుకువస్తున్నాయి. దీంతో ఈ నెల 27న బీహార్ ప్లానింగ్? మంత్రి బిజేంద్ర యాదవ్ మాట్లాడుతూ..ప్రత్యేక హోదా డిమాండ్‌ను జెడియు ఉపసంహరించుకుంటుందని ప్రకటించారు. దీనికి బదులుగా ప్రత్యేక ప్యాకేజిని కోరతామని అన్నారు. బీహార్‌కు ప్రత్యేక హోదా కల్పించాలన్న డిమాండ్‌తో విసిగిపోయామని, కాబట్టి ఈ డిమాండ్‌ను విరమించుకోవాలని నిర్ణయించుకున్నామని నితీష్‌కు అత్యంత సన్నిహితుడైన బిజేంద్ర తెలిపారు.నిర్ణయం అనంతరం... బీహార్‌కు ప్రత్యేక హోదా కల్పించడంలో కేంద్ర, రాష్ట్రంలోని ఎన్‌డిఏ నేతృత్వంలోని డబుల్ ఇంజన్ ప్రభుత్వం విఫలమైందని వామపక్షాలతో కూడిన ప్రతిపక్ష మహాఘట్బంధన్ కూటమి విమర్శలు సంధించింది. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి నితీష్ కుమార్ లంగిపోయారంటూ విమర్శించింది. ప్రతిపక్షాలే కాకుండా.. అధికార పక్షంలోని హిందుస్తానీ అవామ్ మోర్చా (సెక్యులర్) ప్రెసిడెంట్, బీహార్ మాజీ ముఖ్యమంత్రి జితిన్ రామ్ మంజి కూడా .. ఈ డిమాండ్ తమ పార్టీ ఎజెండాలో ఉంటుందని అన్నారు. 'ఇది మా హక్కు. మేం తీసుకుంటాం. దీని కోసం పోరాడేందుకు మేం సిద్ధం' అంటూ జెడియుని లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యానించారు. ప్రత్యేక హోదా డిమాండ్‌ను ప్రధాని మోడీ ముందుకు తెచ్చేందుకు ఓ కమిటీ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. 'మేమంతా బీహారీయులం, ఓటమిని అంగీకరించబోయేది లేదు. ఈ అంశాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంటాం' అని అన్నారు.ప్రతిపక్ష ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ మంగళవారం మాట్లాడుతూ... వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మహాఘట్బంధన్.. ప్రత్యేక హోదా డిమాండ్‌ను ప్రధానంగా తీసుకుని పోటీ చేయనున్నట్లు చెప్పారు. మొత్తం 40 లోక్‌సభ స్థానాలకు గానూ .. 39 స్థానాల్లో గెలుపొందినట్లయితే...అప్పుడు ప్రధాని ఎవరైనా సరే... పాట్నాకు వచ్చి బీహార్‌కు ప్రత్యేక హోదా ప్రకటించాలని డిమాండ్ చేశారు. నితీష్ కుమార్ ఇచ్చిన మాటలను కట్టుబడి ఉండటం లేదని, ముఖ్యమైన అంశాలను వదిలేస్తున్నారని, ఈ వైఖరి అభివృద్ధికి ఆయన నిబద్ధత ఏ పాటిదో బహిర్గతం చేస్తుందని ఆర్జేడీ నేత అలోక్ మెహతా అన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికలను ప్రస్తావించిన ఆయన... తాము 15 స్థానాలు గెలిస్తే.. ప్రత్యేక హోదా తెచ్చేందుకు పనిచేస్తామని జెడియు జాతీయ ప్రధాన కార్యదర్శి కెసి త్యాగి హామీనిచ్చారని, 17 స్థానాలకు గాను 16 స్థానాల్లో జెడియు గెలిచిందని, కానీ ఈ డిమాండ్‌ను ఇప్పుడు ఉపసంహరించుకుందని అన్నారు. బీహార్ ప్రత్యేకహోదా అనేది నితీష్ కుమార్, జెడియు నేతృత్వంలో ఓ రాజకీయ స్టంట్‌గా మారిందని, రాష్ట్రంలో 16 ఏళ్లుగా పాలన సాగిస్తూ.. ఈ డిమాండ్ కోసం అడిగి అడిగి విసిగిపోయామని జెడియు నేతలు చెప్పడం విడ్డూరంగా ఉందని సిపిఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి కర్నల్ విమర్శించారు.ఇటీవల కాలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న నితీష్ కుమార్ ప్రత్యేక హోదా డిమాండ్‌పై ప్రస్తావించలేదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. గతంలో అయితే ఆయన ప్రతి ప్రసంగంలోనూ ఈ డిమాండ్ కీలక ఆందోళనగా మిగిలిపోయిందని, 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం కేంద్రం ముగిసిన అధ్యాయంగా ప్రకటించినప్పటికీ...తన పార్టీ ఈ అంశాన్ని ప్రస్తావించేందుకు కట్టుబడి ఉంటుందని అనేవారని గుర్తు చేసుకున్నారు. మాజీ ఐఎఎస్ ఆఫీసర్ ఎన్‌కె సింగ్ నేతృత్వంలోని 15వ ఆర్థిక సంఘంపైనే...ఇక ప్రత్యేక హోదా ప్రతిపాదనని పక్కకు పెట్టిందని పేర్కొన్నారు. కాగా, ఎన్‌కె సింగ్ బీహార్‌కు చెందిన వ్యక్తి, జెడియుకి అత్యంత సన్నిహితుడే కాకుండా.. ఆ ఆ పార్టీకి ఎంపిగా కూడా వ్యవహరించడం గమనార్హం. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోతే.. సగటు జాతీయ అభివృద్ధిని అందుకోవడానికి బీహార్‌కు 25 ఏళ్లు పడుతుందని, రాష్ట్రంలో పెట్టుబడులు, తలసరి ఆదాయం తక్కువని కేంద్రానికి గుర్తు చేస్తూ ఉండేవారు. కానీ ఇవన్నీ ఇప్పుడు ప్రస్తావించడం లేదు.2006 లోనే తొలిసారి ఈ డిమాండ్‌ను తెరపైకి తెచ్చిన నితీష్ కుమార్... 2010లో బీహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలన్న ప్రచారాన్ని ప్రారంభించారు. ఇది రాష్ట్ర ప్రజల హక్కు అంటూ నినదించారు. ఈ డిమాండ్‌కు మద్దతుగా 2011లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ హయాంలో 1.25 కోట్ల సంతకాలను సేకరించారు. 2012లో నితీష్ 'అధికార్ యాత్ర (రైట్స్ మార్చ్)' చేపట్టారు. ఈ డిమాండ్‌కు మద్దతుగా పాట్నా, ఢిల్లీలో ఇతర ర్యాలీలను నిర్వహించారు. ఈ డిమాండ్లను వినియోగించుకుని 2009 లోక్‌సభ, 2010 అసెంబ్లీ ఎన్నికలు, 2014 లోక్‌సభ, 2015 అసెంబ్లీ ఎన్నికల్లో జెడియు గెలిచేసింది. ఆ తర్వాత కూడా ఈ డిమాండ్ నెరవేర్చాలంటూ నితీష్ పలు మార్లు మోదీపై ఒత్తిడి తెచ్చారు. బీహార్ ప్రజల పట్ల మోడీ సర్కార్ ఏకపక్షంగా వ్యవహరిస్తోందని, 2014 లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని మోడీ ఇదే హామీనిచ్చారని, 2016లో అంతర్రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో కూడా ఈ విషయాన్ని దృష్టికి తీసుకెళ్లారు. 2017తో బిజెపితో చేతులు కలిపే సమయంలో కూడా ఇదే డిమాండ్‌ను తీసుకువచ్చారు.

## వివాదమౌతున్న సర్కార్ నిర్ణయం

విజయవాడ, అక్టోబరు 8, (న్యూస్ పల్స్)పదవ తరగతి తెలుగు పుస్తకంలో నుండి అమరావతి పాఠాన్ని తొలగించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. శతాబ్దాలకాలం నాటి అమరావతి పూర్వ చరిత్రను వివరిస్తూ నూతన అమరావతి రాజధాని ఏర్పాటు వరకూ వివరాలతో కూడిన అంశాలతో రూపొందించిన పాఠాన్ని నూతనంగా ముద్రించిన పాఠ్యపుస్తకాల నుండి ప్రభుత్వం తొలగించింది. గతేడాది పదో తరగతి తెలుగు పాఠ్యపుస్తకాల్లో 13 పాఠ్యాంశాలు ఉండగా, వాటిల్లో రెండోపాఠంగా అమరావతి ఉంది. ఈ పాఠ్యాంశం ఉద్దేశాన్ని కూడా అప్పటి ప్రభుత్వం వివరించింది. 'ఆంధ్రప్రదేశ్‌కు నూతన రాజధానిగా అమరావతి నిర్మితమవుతోంది. చారిత్రక, సాంస్కృతిక నేపథ్యంగల అమరావతి గురించి ఈనాటి ఆంధ్రులు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. మన రాజధాని నగరపు పూర్వ వైభనాన్ని తెలియజేయడమే ఈ పాఠ్యాంశం ముఖ్య ఉద్దేశం' అని స్పష్టంగా పేర్కొన్నారు. ప్రవేశికలో దక్షిణ భారతాన అద్భుతమైన అమరారామాన్ని స్థాపించి బౌద్ధమతాన్ని విశ్వవ్యాప్తం చేశాడు బుద్ధుడు అని పొందుపరిచారు. శిల్పకళా పరిశోధనలో విశిష్ట నైపుణ్యంగల 'ఫెర్గూసన్' ప్రపంచ శిల్ప సంపదలో అమరావతి శిల్పాలు, అత్యున్నత శ్రేణిలో ఉన్నాయని తన పరిశోధన పత్రంలో రుజువులతో పేర్కొన్నారు. ఆ పట్టణ గొప్పతనమేమిటో తెలుసుకోవాలంటే ఈ పాఠం చదవండి అని సూచించారు. బౌద్ధచైత్యాలతో నిండిన ప్రాచీన ఆంధ్రుల రాజధాని ఇప్పుడు సచేతన రాజధానిగా రూపుదిద్దుకుంటోందని, మళ్లీ ఖ్యాతిని ఆర్జించేందుకు పునాదులు వేసుకుంటోందని పేర్కొన్నారు. ప్రధాని హోదాలో మోడీ శంకుస్థాపన చేసిన విషయాన్ని, ఎలా నిర్మిస్తామనేది క్లుప్తంగా వివరించారు. అమరావతిని రాజధానిగా ఏర్పాటు చేయాలని అసెంబ్లీలో చర్చ జరిగిన సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తాము స్వాగతిస్తున్నామని, అమరావతి సరైన ప్రాంతమని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో మూడు రాజధానులు ఉంటాయని తెలిపారు. అందులో ప్రస్తుత అమరావతి శాసన రాజధానిగా ఉంటుందని ప్రకటించారు. ఆచరణలో పాఠ్యపుస్తకాల్లో నుండి అమరావతి చరిత్ర, రాజధానికి సంబంధించిన పాఠ్యాంశాన్ని తొలగించేశారు. మూడు రాజధానులు వస్తాయనే పేరుతో అమరావతి పాఠ్యాంశాన్ని తొలగించేశారని అనుకున్నా, అమరావతిలో ఒక రాజధాని ఉండనే ఉంది. ఇక్కడ శాసన రాజధాని ఉంటుందని అసెంబ్లీలో ఆమోదించిన బిల్లులో స్పష్టం చేశారు. అలాంటప్పుడు అమరావతి పాఠ్యాంశాన్ని తీసేయాల్సిన అవసరం ఏమొచ్చిందనేది ప్రశ్న. అంటే అసలు రాజధాని ఇక్కడ ఉండనే ఉండదని చెప్పదలచుకున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మూడు రాజధానులకు అనుగుణంగా వెళుతున్నారు అనుకుంటే న్యాయ రాజధాని కర్నూలు, పరిపాలనా రాజధాని విశాఖపట్నానికి సంబంధించిన చారిత్రక ఇతర అంశాలను పాఠ్యాంశంలో చేర్చాలిగానీ, అమరావతిని తొలగించడం దేనికన్నది మరొక ప్రశ్న. దీంతోపాటు అమరావతికి సంబంధించిన అనేక అంశాలపై ఇప్పటికే కోర్టులో కేసులు నడుస్తున్నాయి. విచారణ జరుగుతోంది. ఈ సమయంలో అసలు అమరావతి రాజధాని గురించిన అంశాన్ని పాఠ్యపుస్తకాల్లో నుండి తొలగించడం ఉచితమేనా అన్నది ప్రభుత్వం ఆలోచించుకుని ఉండాలి. ఈ పాఠ్యాంశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వాన అమరావతి నిర్మాణం జరుగుతోందని పేర్కొన్నారు. ఇప్పుడు ముఖ్యమంత్రి మారిపోయారు కనుక పాఠ్యాంశాన్ని తొలగించడం సమర్థనీయమేనని కొందరు వైసిపి నేతలు పేర్కొంటున్నారు. అటువంటప్పుడు ఆ భాగాన్ని తాజా పరిచి ఉండాల్సింది. అంతేగానీ ఏకంగా మొత్తం పాఠ్యాంశాన్ని తొలగించడం సబబుకాదని విమర్శకులు అంటున్నారు. చారిత్రక అంశాలను భవిష్యత్ తరాలకు తెలియకుండా పాఠ్యాంశాన్ని తొలగించడం సరైంది కాదనే భావవ ఉపాధ్యాయుల్లోనూ, విద్యార్థుల తల్లిదండ్రుల్లోనూ వ్యక్తమవుతోంది.20 శతాబ్దాల చరిత్ర కలిగిన అమరావతి శాతవాహనుల రాజధానిగా బౌద్ధమతంతోపాటు పలు మతాచారాలకు, సంస్కృతి సంప్రదాయాలకు నిలయంగా వెలుగొందిందని, చరిత్రను భావితరాల వారికి అమూల్యంగా అందించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. మూడు రాజధానుల ప్రస్తావన తీసుకొచ్చి అమరావతి ఉండకూడదనే ఉద్దేశంతోనే పాఠ్యాంశాన్ని తొలగించారని విమర్శించారు. వెంటనే అమరావతి పాఠాన్ని తిరిగి చేర్చేందుకు తగు చర్యలు తీసుకోవాలని సిఎంను కోరారు.భావితరాలు చరిత్రను మర్చిపోయే విధంగా అమరావతి పాఠ్యాంశాన్ని పుస్తకాల నుండి తొలగించడం అన్యాయమని టిడిపి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాదు తెలిపారు. అమరావతి ఆంధ్రుల ఆత్మాభిమానానికి ప్రతీకని, అలాంటి ప్రాంతాన్ని ఛిన్నాభిన్నం చేసే క్రమంలోనే వైసిపి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా పాఠ్యాంశాన్ని తొలగించిందని ఆయన తెలిపారు. రాజధాని కావాలని పోరాడుతున్న వారిని కూడా ముఖ్యమంత్రి సొంత ఎజెండాతో వేధిస్తున్నారని తెలిపారు.శాతవాహనులు తూర్పుదిశగా విస్తరించే క్రమంలో ధాన్యకటకం రాజధానిగా చేసుకుని క్రీస్తుశకం 1వ శతాబ్ది నుండి క్రీస్తుశకం 220 వరకు పరిపాలన సాగించారు. గౌతమీపుత్ర శాతకర్ణి, పులోమావి, యజ్ఞశ్రీ శాతకర్ణి పాలన చేశారు. వారికి ముందు సమగోప, గోబధ, నరన, కంవాయల వంశాలకు చెందిన వారు పాలించారు. అనంతరం ఇక్ష్వాకులు, పల్లవులు, విష్ణుకుండినులు, చాళుక్యులు కూడా ధాన్యకటకాన్ని అభివృద్ధి చేశారని స్పష్టం చేశారు. శ్రీకృష్ణదేవరాయలు అమరలింగేశ్వర దేవాలయానికి విలువైన కానుకలు సమర్పించారని 1798లో ఈ ప్రాంతాన్ని పాలించిన రాజా వెంకటాద్రినాయుడు నగరాన్ని తీర్చిదిద్దారని తెలిపారు. ఈ ప్రాంతంలో బౌద్ధ, జైన, శైవ, వైష్ణవ, ముస్లిం, క్రైస్తవ మత సంప్రదాయ సంస్కృతుల ప్రభావాలు కనిపిస్తాయని, అమరావతికి సమీపంలోని వడ్డమాను, మునుగోడు గ్రామాల్లో జైనమతం విస్తరించిందని పాఠ్యాంశంలో పొందుపరిచారు.

## పక్కదారి...కాశీపురం ఎత్తిపోతల పథకం.

ఒంగోలు, అక్టోబరు 8, (న్యూస్ పల్స్)పొలం పక్కనే నీరు ప్రవహిస్తున్నా అది పైర్లకు ఉపయోగపడకపోవడంతో ప్రభుత్వాలు సాగుభూములకు అందించేందుకు ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసింది. మండలంలోని పాములపాడు, గొల్లపల్లి, కాశీపురం గ్రామాలకు చెందిన 625 ఎకరాలకు నీరు అందించే ఉద్దేశంతో 1988?89 సంవత్సరంలో దాదాపు రూ.20 లక్షల వ్యయంతో మూసీనదిపై ఈ పథకాన్ని నిర్మించారు. దీనికి 25 హెచ్‌పీ సామర్థ్యం గల మూడు విద్యుత్ మోటార్లు, నీటి సరఫరాకు పైపు లైన్‌లు ఏర్పాటు చేశారు. పూర్తిస్థాయిలో కాకున్నా పథకం మొదట్లో కొంతమేరకు పనిచేసింది. నీటి సరఫరా లేక సాగు తగ్గి నిర్వహణ లోపంతో మూడేళ్ల అనంతరం రైతులు ఒక లక్ష రూపాయలు పైబడి విద్యుత్ బకాయిలు పడ్డారు.కరెంట్ బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా అధికారులు సరఫరా తొలగించారు. పథకం పని చేయక పోవడంతో మోటార్లు, భవనం తలుపులు, కిటికీలు దొంగలు ఎత్తుకుపోయారు. దీంతో అక్కడ పిచ్చి చెట్లు పెరిగి సాగు భూములు బీడుగా మారాయి. ప్రజల విన్నపం మేరకు తరువాత వచ్చిన ప్రభుత్వాలు పథకానికి సంబంధించిన పూర్తి సమాచారం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. దీంతో కదిలిన యంత్రాంగం పథకం గ్రౌండ్ రిపోర్టు తయారు చేసింది. రైతులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు అభిప్రాయాలు తెలుసుకొని పథకానికి అక్కడ అనువైన ప్రాంతం కాదని, కుంచేపల్లి మూసీనది మాగాణి వద్ద ఏర్పాటు చేస్తే ఉపయోగకరమని పెర్కొంటూ నివేదిక పంపించారు.కాశీపురం ఎత్తిపోతల పథకంను కుంచేపల్లి వద్ద పునర్నిర్మాణం చేస్తే ఉపయోగకరంగా ఉంటుందని రైతులు, అధికారులు మొత్తుకున్నా వారి మాటలును గత తెలుగుదేశం ప్రభుత్వం పట్టించుకోలేదు. కాసుల కోసం కక్కుర్తి పడి ఆపార్టీ నాయకులు అప్పటి అధికారులపై వత్తిడి తెచ్చి పనిచేయని పథకానికి మరమ్మతుల కోసం రూ.3.20 కోట్లతో ఎస్టిమెషన్ వేయించి మంజూరు చేయించారు. ఈ పథకానికి 10 క్యూసెక్కులు నీటి పరిమాణం అవసరమని అధికారులు గుర్తించారు. దానికి తగ్గట్టు బావి, సంపు నిర్మాణాలు చేపట్టినట్లు కాకి లేక్కలు చూపి పాత పథకానికే ఏవో కొన్ని మొక్కుబడి పనులు చేసి మసిపూచి మారేడుకాయ చేశారు. పాత భవనాన్ని మర్మతులు చేసి, తలపులు బిగించి, మోటార్లు రీపేరు చేయించి, ట్రాన్స్‌పార్మర్లు ఏర్పాటు చేసి చేతులు దులిపేసుకున్నారు.పథకానికి నీరు రావాలంటే మూసీ నదిలో నీరు నిల్వ ఉండాలి. నీరు నిల్వ ఉండాలంటే నదికి అడ్డంగా కట్టనిర్మించాలి. కానీ ఇక్కడ అలాంటి పని చేయలేదు. దీంతో కోట్ల రూపాయలు వెచ్చించినా పథకం పనిచేయలేదు. మూసీనదిలో ఇసుక మేట వేయడం, పథకం ప్రాంతంలో చిల్ల చెట్లు పెరిగి అడవిని తలపిస్తుంది. దీంతో ప్రస్తుతం వర్షాలు ఎక్కువగా పడుతున్నప్పటికీ నది వద్ద చుక్కనీరు నిల్వ ఉండక పోవడం కొసమేరుపు. వందలాది ఎకరాల భూములు బీడుగా ఉన్నాయని, ఈ స్కీం వినియోగంలోకి తీసుకురాక పోతే మరలా సామగ్రి దొంగల పాలౌతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతు పక్షపాతిగా ఖ్యాతిగాంచిన ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వమైనా నదిలో నీరు నిల్వ ఉండటానికి అడ్డు కట్ట వేసి ఈ స్కీం వినియోగంలోకి తీసురావాలని ఆయకట్టుదారులు కోరుతున్నారు.

## రూటు మార్చిన ఇసుక మాఫియా



అనంతపురం, అక్టోబరు 8, (న్యూస్ పల్స్)రెవెన్యూ, సివిల్ పోలీసుల దాడులతో ఇసుక మాఫియా రూటు మారింది. ఇన్నాళ్లూ అధికారుల కళ్లుగప్పి అర్ధరాత్రి ఇసుకను తరలించిన వారు.. ఇప్పుడు దర్జాగా అధికారికంగానే తెప్పిస్తున్నారు. ఇతరుల ఆధార్ కార్డులు వినియోగించి ఇసుక బుక్ చేసి.. దాన్నంతా ఒకేచోట డంప్ చేసి ఆ తర్వాత అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయడంతో ఇసుకాసురులు కొత్తదారులు వెతుక్కుంటున్నారు. గతంలో రీచ్ నుంచి డిపోలకు కాకుండా ఇతర ప్రాంతాలకు తరలించుకుని విక్రయించేవారు. అయితే దీనిపై సెబ్ నిఘా ఉంచి సదరు కాంట్రాక్టర్లపై ఏకంగా కేసులు పెట్టడంతో ఇసుక అక్రమ రవాణా తగ్గిపోయింది. దీంతో ఇసుక అక్రమ రవాణాపైనే ఆధారపడి బతుకున్న వారు మరో కొత్తదారిలో అక్రమాలకు తెరలేపారు. ఇతరుల ఆధార్‌కార్డులతో ఇసుకను ఒకే ప్రాంతానికి బుక్ చేసుకుని.... అక్కడే డంప్ చేసేస్తున్నారు. అక్కడి నుంచి దర్జాగా అధిక ధరకు విక్రయిస్తున్నారు. మామూలుగా వర్షాకాలం నిర్మాణ పనులు ఎక్కడికక్కడ ఆగిపోతాయి. దీంతో ఇసుక డిమాండ్ బాగా తగ్గిపోతుంది. కానీ జిల్లాలో ఇసుక డిమాండ్ గతంతో పోలిస్తే రెండు రెట్లు ఎక్కువగా ఉంటోంది. వాస్తవానికి ఇసుక రీచ్ నుంచి డిపోకు.. అక్కడి నుంచి వినియోగదారుల చేరే వరకూ నిఘా ఉంచేందుకు వాహనాలకు ఇప్పటికే జీపీఎస్ పరికరాలను అమర్చారు. ఈ నేపథ్యంలోనే ఇసుకాసురులు కొత్త మార్గాన్ని వెతుక్కున్నారు. బుకింగ్ సమయంలోనే అక్రమాలు చేయడం ద్వారా ఆదాయార్జనకు తెరలేపారు. గతంలో రోజువారీగా వర్షాకాలంలో కేవలం 1,000 టన్నుల మేరకు ఇసుక డిమాండ్ ఉండేది. అయితే, ఇందుకు భిన్నంగా ఇప్పుడు ఏకంగా 4 వేల నుంచి 5 వేల వరకూ డిమాండ్ ఉంటోంది. దీంతో అధికారులు అప్రమత్తమై మొత్తం ఇసుక బుకింగ్స్‌పై కూపీలాగటం మొదలు పెట్టినట్టు తెలుస్తోంది. వాస్తవానికి జిల్లాలో రోజూ 4 వేల టన్నుల వరకూ ఇసుక బుకింగ్ జరుగుతోంది. కొన్ని రోజుల్లో ఇది కాస్తా 5వేల టన్నులకు చేరుకుంటోంది. అయితే, వాస్తవ వినియోగం ఇంత ఉందా! లేదా? అనే అనుమానం కలుగుతోంది. ఈ స్థాయిలో నిర్మాణాలు జరుగుతున్నాయా అనే అనుమానం అధికారులను తొలుస్తోంది. ఈ నేపథ్యంలో అసలు ఎక్కడి నుంచి బుకింగ్ జరుగుతోంది? నిజంగా వారి కోసమే ఇసుకను బుకింగ్ చేసుకున్నారా....? వారి ఆధార్‌కార్డుతో ఇతరులు బుక్ చేసి... పక్కదారి పట్టిస్తున్నారా....? అనే కోణంలో అధికారులు విచారణ ప్రారంభించారు. ప్రధానంగా అనంతపురం పట్టణంతో పాటు కదిరి, హిందుపురం, మడకశిర ప్రాంతాల్లో ఈ విధంగా ఇతరుల ఆధార్‌కార్డులతో బుకింగ్ జరుగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## ఎంపీల దారెటు

విజయవాడ, అక్టోబరు 8, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీకి రాజ్యసభ సభ్యులు అచ్చిరారన్న ఒక సెంటిమెంట్ ఉంది. రాజ్యసభ పదవి ఇచ్చినా అనేక మంది నేతలు పార్టీని విడిచి వెళ్లారు. సరే వారి సంగతి పక్కన పెడితే ఇప్పుడు పార్లమెంటు సభ్యుల పరిస్థి?తి కూడా అలాగే తయారయిందనుకోవాల్సి ఉంటుంది. మొన్నటి ఎన్నికల్లో టీడీపీ తరుపున ముగ్గురు ఎంపీలు గెలిచారు. గుంటూరు, విజయవాడ, శ్రీకాకుళం ఎంపీలు మొన్నటి ఎన్నికల్లో గెలిచారు. వీరిలో ఒక్కరే పార్టీలో యాక్టివ్ గా ఉండటం విశేషం.విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని నాని ఇప్పటికే తాను మరోసారి పోటీ చేయబోనని చంద్రబాబుకు స్పష్టం చేశారు. ఆయన పార్టీలో యాక్టివ్ గా లేరు. ఈ మూడేళ్లు ఎంపీగా తాను నియోజకవర్గం పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని, ఎప్పటికీ గుర్తుండి పోయేలా కార్యక్రమాలను చేపట్టాలన్నది తన ఉద్దేశ్యమని కేశినేని నాని తనను కలసి టీడీపీ నేతలతో చెప్పినట్లు తెలిసింది. ఆయన పార్టీ నిర్వహించే కార్యక్రమాలకు పూర్తిగా దూరంగా ఉంటున్నారు.పార్టీ అధినాయకత్వంపై నెలకొన్న అసంతృప్తి ఆయన దూరంగా ఉంటున్నారు. ఇక గుంటూరు పార్లమెంటు సభ్యుడు గల్లా జయదేవ్ సయితం గత కొన్ని నెలలుగా పార్టీకి అందుబాటులో లేరు. ఆయన ముఖ్యమైన కార్యక్రమాలకు కూడా గైర్హాజరవుతున్నారు. కొంతకాలం విదేశాలకు వెళ్లి వచ్చినా, అంతకు ముందు కూడా ఆయన ఇన్ యాక్టివ్ గానే ఉన్నారు. గుంటూరు పార్టీ నేతలు గల్లా జయదేవ్ పై పార్టీ అధినేతకు కూడా ఫిర్యాదు చేశారు.అయినా గల్లా జయదేవ్ తీరు మారలేదంటున్నారు. ఆయన గుంటూరు పార్లమెంటు పరిధిలో పర్యటించి నెలలు గడుస్తుందంటున్నారు. పార్లమెంటు సమావేశాలకు తప్ప ఎక్కడా గల్లా జయదేవ్ కన్పించకపోవడం చర్చనీయాంశమైంది. కేశినేని పార్టీపై అసంతృప్తి, గల్లా జయదేవ్ అధికార పార్టీ తో ఇబ్బందులు తెచ్చుకోవడం ఎందుకన్న కారణంగానే పార్టీకి దూరంగా ఉంటున్నారు. ఇక శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్ నాయుడు మాత్రమే పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. పార్టీ కార్యక్రమాల్లో ఎంపీ స్థాయి నేతలే పాల్గొనక పోతే క్యాడర్ కు ఎలాంటి సంకేతాలు పంపుతున్నామని కొందరు ప్రశ్నిస్తున్నారు. కానీ చంద్రబాబు మాత్రం వీరిని ఏమీ అనలేక, చేయలేక చూసీ చూడనట్లు నటిస్తున్నారు.

## మేము మా ఫ్యామిలీ అంటున్న సీనియర్ నేతలు

గుంటూరు, అక్టోబర్ 8, (న్యూస్ పల్స్కాలం కలసి రాకపోతే తాడే పామై కరుస్తుందన్నది పాత సామెత. ఈ సామెత ఇప్పుడు అక్షరాలా విపక్ష తెలుగుదేశం పార్టీకి అచ్చుగుద్దదినట్లు సరిపోతుంది. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు అసలే సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోరన్న పేరు బాగా ఉంది. ప్రతి నిర్ణయాన్ని నానుస్తూ దానిని డైల్యూట్ చేస్తుంటారని రాజకీయ వర్గాల్లో ఆయనకు ట్యాగ్ లైన్ ను కూడా తగిలించారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో నేతల బ్లాక్ మెయిలింగ్ కు తట్టుకోగలరా? అన్నదే ప్రశ్న.తెలుగుదేశం పార్టీకి వచ్చే ఎన్నికల్లో సొంత పార్టీ నేతల అసంతృప్తి నుంచి బయటపడటం అంత ఈజీ కాదు. ఇప్పటికే రాయపాటి సాంబశివరావు లాంటి నేతలు చంద్రబాబుకు పరోక్షంగా సంకేతాలు ఇచ్చి వచ్చారు. నరసరావుపేట పార్లమెంటుకు తన కుమార్తె, సత్తెనపల్లి సీటును తన కుమారుడు రంగారావుకు ఇవ్వాలన్నది రాయపాటి సాంబశివరావు అల్టిమేటం. అయితే రాయపాటికి ఇది కొత్తేమీ కాదు. తాను అనుకున్నది అనుకున్నట్లు చెప్పేస్తారు.ఇక రాయపాటి సాంబశివరావు తరహాలోనే చంద్రబాబుకు ఎన్నికల సమయంలో మరింత మంది నేతలు పరోక్ష హెచ్చరికలు పంపే అవకాశముందంటున్నారు. ముఖ్యంగా విశాఖ జిల్లాలో అయ్యన్నపాత్రుడు కూడా రెండు స్థానాలను కోరే అవకాశముంది. అలాగే తూర్పు గోదావరి జిల్లాలో యనమల రామకృష్ణుడు తన కుటుంబ సభ్యులకు తునితో పాటు కాకినాడ రూరల్ ఇవ్వాలని కోరుతున్నారట. ఇక రాజమండ్రిలోనూ ఆదిరెడ్డి కుటుంబం ఎమ్మెల్యే టిక్కెట్ తో పాటు ఎంపీటిక్కెట్ ను కూడా కోరే అవకాశముంది.రాయలసీమలోనూ అనంతపురం జిల్లాలో జేసీ బ్రదర్స్, నిమ్మల కిష్టప్ప, కర్నూలు జిల్లాలో కోట్ల, కేఈ, భూమా కుటుంబాలు కూడా ఒక్క టిక్కెట్ తో సరిపెట్టుకునే పరిస్థి?తి లేదు. వీరి కుటుంబానికి రెండు టిక్కెట్లు కేటాయించకపోతే వెంటనే రియాక్ట్ అయ్యే అవకాశాలున్నాయి. రాయపాటి సాంబశివరావు భోళా మనిషి కాబట్టి బయటపడ్డారు. కానీ కొందరు ఇప్పటికే సంకేతాలు పంపగా, మరికొందరు ఎన్నికల సమయంలో బాబు ముందు తమ ప్రతిపాదనలు ఉంచనున్నారు. మొత్తం మీద రాయపాటి ఇచ్చిన అల్టిమేటంలు అనేకం చంద్రబాబుకు చేరే అవకాశాలున్నాయి.

## 70 కేసుల్లో మొట్టికాయలు

విజయవాడ, అక్టోబరు 8, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా జగన్ బాధ్యతలను స్వీకరించి దాదాపు మూడేళ్లు కావస్తుంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను న్యాయస్థానాలు తప్పుపట్టాయి. దాదాపు 70 కిపైగా కేసుల్లో జగన్ ప్రభుత్వానికి హైకోర్టు నుంచి ఎదురుదెబ్బలు తగిలాయి. అయితే లోపం ఎక్కడుంది? అధికారులు సరైన దిశగా ఉత్వర్వులు జారీ చేయడం లేదా? జీవోలు జారీ చేసే సమయంలో లీగల్ ఒపీనియన్ తీసుకోవడం లేదా? అన్న సందేహం ప్రతి ఒక్కరికీ కలుగుతుంది.ఒకటా? రెండా? గడచిన రెండేళ్లలో ఎన్నో జీవోలు. ఎన్నో తీర్పులు. దాదాపు అన్నీ ప్రతి కూలమే. ప్రభుత్వ నిర్ణయాల దగ్గర నుంచి విపక్ష నేతలపై కేసుల వరకూ న్యాయస్థానాల్లో వీగిపోతునే ఉన్నాయి. ఇంటి స్థలాల సేకరణ నుంచి చంద్రబాబుపై కేసు వరకూ ఏ ఒక్కటి ప్రభుత్వానికి అనుకూలంగా రాలేదు. జగన్ ప్రభుత్వంలో న్యాయనిపుణులు కూడా సక్రమమైన సూచనలు అందించడం లేదన్నది పార్టీ వర్గాల నుంచి విన్పిస్తున్న అభిప్రాయం.ఇటీవల టీటీడీ ప్రత్యేక ఆహ్వానితుల జీవోను కోర్టు కొట్టివేసింది. యాభై మందిని టీటీడీలో నియమిస్తున్నప్పుడు కనీసం న్యాయసలహా తీసుకోవాల్సిన అవసరం లేదా? అన్న ప్రశ్న తలెత్తుతోంది. ఇతర రాష్ట్రాల వారిని కూడా నియమించి జీవో కొట్టివేయడంతో వారి ముందు జగన ప్రభుత్వం నవ్వుల పాలు కావాల్సి వచ్చింది. ఈ జీవోను జారీ చేస్తూ ఏ నిబంధన కింద వీరిని నియమించారో పేర్కొన లేదు. ఇక విపక్ష నేతలపై పెట్టిన అనేక కేసులు వీగిపోయాయి. చివరకు విశాఖ లాంటి నగరాల్లో భూమిని ఆక్రమించుకున్నా కోర్టు స్టే ఉత్తర్వుల కారణంగా ప్రభుత్వం ఏమీ చేయలేకపోతోంది.తమిళనాడుకు చెందిన మాజీ న్యాయమూర్తి కనగరాజ్ ను తొలుత రాష?ట్ర ఎన్నికల కమిషనర్ గా నియమించింది. దానిని కొట్టవేయడంతో మరొక సారి పోలీస్ కంప్లైంట్ అథారిటీ ఛైర్మన్ గా నియమించారు. వయో పరిమితి విషయాన్ని పరిశీలించక పోవడంతో ఆ కేసును కూడా కొట్టివేసింది. ఇదొక్కటే కాదు అనేక కేసుల విషయంలో జగన్ ప్రభుత్వానికి కోర్టు లో ఎదురుదెబ్బలు తగులుతూనే ఉన్నాయి. కానీ జీవోలు జారీ చేయడం ఆగలేదు. కోర్టులు కొట్టివేయడం కూడా ఆగడం లేదు. అయితే న్యాయస్థానాల తీర్పులతో తమకు ప్రజాన్యాయస్థానంలో సానుకూలత ఉందని వైసీపీ ధీమాగా ఉంది. అందుకే జీవోల విషయంలో ఏ మాత్రం శ్రద్ధ చూపడం లేదన్న విమర్శలున్నాయి.

## కర్నూలులో బంగారం నిక్షేపాలు

కర్నూలు, అక్టోబరు 8, (న్యూస్ పల్స్)బంగారు నిక్షేపాల వెలికితీతలో భాగంగా కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలోని పగిడిరాయి?జొన్నగిరి గ్రామాల మధ్య డ్రిల్లింగ్ పనులను జియో మైసూర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రారంభించింది. తుగ్గలి మండలంలోని పగిడిరాయి, బొల్లవానిపల్లి, జొన్నగిరి పరిసర ప్రాంతాల్లో 40 ఏళ్లుగా వివిధ కంపెనీలు సర్వేలు చేసి, బంగారం నిక్షేపాలున్నాయని గుర్తించాయి. దాదాపు 15 ఏళ్లుగా సర్వే చేస్తున్న జియో మైసూర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నిక్షేపాల వెలికితీతకు సిద్ధమై.. 2013లోనే ప్రభుత్వ అనుమతులు పొందింది.నిక్షేపాల వెలికితీతపై కొందరు కోర్టుకు వెళ్లడంతో పనుల్లో జాప్యమైంది. గతేడాది ఎకరా రూ.12 లక్షలు చొప్పున 300 ఎకరాలు కొనుగోలు చేసి ఒప్పందం కుదుర్చుకుంది. అయితే, భూములు కోల్పోయే రైతులకు డబ్బులు చెల్లించడంలో జాప్యం జరగడం, కొన్నాళ్ల పాటు కంపెనీ ప్రతినిధులు మొహం చాటేయడంతో మైనింగ్ ప్రాజెక్టు కలగా మిగిలింది. ఎట్టకేలకు రెండు రోజుల క్రితం కంపెనీ ప్రతినిధులు వచ్చి రైతులతో మాట్లాడి ఏడాది కౌలు చెల్లించి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. సోమవారం డ్రిల్లింగ్ పనులు మొదలు పెట్టారు.

# పక్క నియోజకవర్గం నుంచి పంతల సురేష్

కడప, అక్టోబరు 8, (న్యూస్ పల్స్)భారతీయ జనతా పార్టీ బద్వేలు ఉప ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధమయింది. తమ పార్టీ అభ్యర్థిగా సురేష్ పేరును ప్రకటించింది. కానీ సోషల్ మీడియాలో బీజేపీ దుస్థితిపై కామెంట్స్ లెక్కకు మించి కనపడుతున్నాయి. పార్టీ దుస్థితి ఏంటో బద్వేలులో అభ్యర్థి ప్రకనట చూసిన తర్వాతైనా అర్థమవుతుంది కదా? అని నెటిజన్లు ఎద్దేవా చేస్తున్నారు. జనసేన బద్వేలు బరి నుంచి తప్పుకున్నా పోటీలో బీజేపీ ఉండనుంది. బద్వేలు లో బీజేపీ స్ట్రాంగ్ గా లేదన్నది మరోసారి అభ్యర్థి ఎంపికతో అర్థమయింది. బద్వేలులో బీజేపీకి బలం లేదన్నది అందరికీ తెలిసిందే. కడప జిల్లాలోనే ఆదినారాయణరెడ్డి, సీఎం రమేష్ వంటి నేతలు తప్పించి ఆ పార్టీకి మరో బలమైన నేత లేరు. వీరిద్దరూ పెద్దగా పార్టీని పట్టించుకోవడం లేదు. ఇక బద్వేలు పరంగా చూసుకుంటే బీజేపీ ఇక్కడ నామమాత్రమేనని చెప్పుకోవాలి. ఈ నియోజకవర్గంలో బీజేపీ పోటీకి దింపండం కేవలం రాజకీయ పరమైన నిర్ణయమే. బద్వేలులో బీజేపీ ఎంపిక చేసిన అభ్యర్థి పంతల సురేష్ ఈ నియోజకవర్గానికి చెందిన వారు కాదు. ఆయన రైల్వేకోడూరు నియోజకవర్గానికి చెందిన నేత. ఆయన తొలి నుంచి బీజేపీ అనుబంధ విభాగాల్లో పనిచేస్తున్నారు. ఏబీవీపీ, బీజేవైఎంలలో వివిధ పదవులను నిర్వహించారు. బీజేపీలో దళితనేతగా కొంత పేరుంది. 2019 ఎన్నికల్లో సురేష్ రైల్వే కోడూరు నియోజకవర్గం నుంచి బీజేపీ తరుపున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. రైల్వే కోడూరు నియోజకవర్గానికి చెందిన వారిని బద్వేలు బరిలో దింపడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. బద్వేలులో బీజేపీకి సరైన నేత కొరవడటమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. విజయజ్యోతి పేరును తొలుత పరిశీలించినా ఆమె టీడీపీ నుంచి జనసేన మద్దతుదారుగా ఉండటంతో ఆమె పేరును పక్కన పెట్టారు. సురేష్ పార్టీ సిద్ధాంతాలను నమ్మిన వ్యక్తి కావడంతో ఆయన ఎంపిక జరిగింది. బద్వేలులో అభ్యర్థి ఎంపికతోనే బీజేపీ దుస్థితి బయటపడిందన్న సెటైర్లు వినిపిస్తున్నాయి. పల్స్ పట్టుకున్న డాక్టర్‌బద్వేలు ఉప ఎన్నికకు సమయం దగ్గరపడింది. నేతలు ఎన్నికల ప్రచారంలో బీజీగా ఉన్నారు. డాక్టర్ దాసరి సుధ వైసీపీ అభ్యర్థిగా దాదాపు మూడు నెలల నుంచి ప్రజల్లోనే ఉంటున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే అకాల మరణంతో వచ్చిన ఈ ఎన్నికలలో దాసరి సుధను పార్టీ హైకమాండ్ వైసీ?పీ అభ్యర్థిగా ప్రకటించింది. ఇప్పటికే ఆమె జనంలో ఉండటం, భర్త మరణంతో వచ్చిన సానుభూతితో తన గెలుపు సునాయాసమని దాసరి సుధ భావిస్తున్నారు. దాసరి సుధ గైనకాలజిస్టు. డాక్టర్ చదవి మరో డాక్టర్ వెంకటసుబ్బయ్యను వివాహం చేసుకున్నారు. ఇద్దరూ కలసి కడప లో ప్రయివేటు ప్రాక్టీస్ ను నిర్వహిస్తూ సుపరిచితులయ్యారు. డాక్టర్ దాసరి సుధ గైనకాలజిస్టు కావడంతో జిల్లా నలుమూలల నుంచి వైద్యం కోసం ఆమె వద్దకు తరలి రావడం, బద్వేలు నుంచి కూడా ఎక్కువ సంఖ్యలో దాసరి సుధ వద్దకు వస్తుండటంతో ఆ పరిచయాలు మరింత అనుకూలిస్తాయని చెబుతున్నారు. దాసరి సుధ తొలిసారి ఇప్పుడు రాజకీయాల్లోకి వచ్చినా గత రెండేళ్ల నుంచి తన భర్తతో కలసి నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. ఆమెకు అది ప్లస్ పాయింట్. మరోవైపు ఇక్కడ వైసీపీ బలంగా ఉంది. గత రెండు ఎన్నికల్లోనూ వైసీపీ అభ్యర్థులే ఇక్కడ విజయం సాధించారు. గత ఎన్నికల్లో వెంకటసుబ్బయ్యకు 44 వేలకు పైగా మెజారిటీ వచ్చింది. ఈ మెజారిటీని అధిగమించాలన్న కసితో దాసరి సుధ నియోజకవర్గమంతా పర్యటన చేస్తున్నారు. డాక్టర్ దాసరి సుధ ఏక పక్ష విజయం సాధించే అవకాశముంది. టీడీపీ బరి నుంచి తప్పుకుంది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తమ అభ్యర్థులను బరిలోకి దింపుతున్నాయి. అయితే వైసీపీ మా?త్రం మెజారిటీపైనే ఎక్కువగా దృష్టి పెట్టింది. రికార్డు స్థాయి మెజారిటీ కోసం వైసీపీ అన్ని ప్రయత్నాలు చేస్తుంది. ఏక పక్ష విజయంతో ప్రజల్లోకి వైసీపీ ఇమేజ్ చెక్కు చెదరలేదన్న సంకేతాలను నేతలు పంపాలనుకుంటున్నారు.

# పిల్లిగుండ్ల గ్రామస్తులు వైసీపీ ని వీడి 100 మంది టిడిపి పార్టీలో చేరిక

గోనెగండ్ల అక్టోబరు 8, (న్యూస్ పల్స్) గోనెగండ్ల మండలంలోని పిల్లగుండ్ల గ్రామానికి చెందిన వైసిపి నాయకులు 8 అక్టోబర్ శుక్రవారం రోజు జయపాల్, బుగ్గన్న, వెంకటేశ్వర్లు, బజ్జి మాదన్న, రవి కుమార్, బోయ గోవింద్, పరమేష్, ఉసేని, సుంకన్న మరియు వారి అనుచరులు సుమారు 100 మంది పిల్లగుండ్ల గ్రామ టిడిపి పార్టీ నాయకులు రాముడు ఆధ్వర్యంలో టిడిపి పార్టీలోకి చేరినారు. ఈ సందర్భంగా ఎమ్మిగనూరు నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు గౌ శ్రీ డా బి వి జయనాగేశ్వర రెడ్డి గారు వీరికి టిడిపి పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి సాదారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా టిడిపి పార్టీలోకి చేరిన పిల్లగుండ్ల గ్రామ నాయకులు మాట్లాడుతూ అధికార వైసిపి పార్టీ అధినేత, స్థానిక ఎమ్మిగనూరు శాసన సభ్యులు అధికారం లోకి వచ్చి సుమారు 3 సంవత్సరాలు అవుతున్నా కనీసం ఎక్కడ కూడా ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. వైసిపి నాయకులు మోనార్క్ నిర్ణయాల వల్ల, అరాచక పాలన వల్ల కింది స్థాయి కార్యకర్త నుండి బడా బడా నాయకుల వరకు వైసిపి పార్టీలో అందరూ కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. గతంలో టిడిపి హయాంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలకు, ప్రజలలో టిడిపి పార్టీకి పెరుగుతున్న ఆదరణకు ఆకర్షితులై అభివృద్ధి జరగాలి అంటే ఒక్క టిడిపి పార్టీతోనే సాధ్యమని తెలుసుకొని టిడిపి పార్టీలోకి చేరుతున్నట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## విద్యారంగ సమస్యలపై సమరశీ ల పోరాటాలు

ఎమ్మిగనూరుఅక్టోబరు 8, (న్యూస్ పల్స్) పట్టణంలో విద్యారంగ సమస్యలు పై సమరాశిలా పోరాటాలకు విద్యార్థులు సిద్ధం కావాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ ఏఐఎస్ఎఫ్ ఎమ్మిగనూరు తాలూకా కార్యదర్శి సురేంద్రబాబు పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మిగనూరు లో ఏ ఐ ఎస్ ఏ ఆఫీస్ లో నూతన టౌన్ కమిటీ వేయడం జరిగింది అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలు ఎండగడుతూ దేశవ్యాప్తంగా పోరాటాలు నిర్వహిస్తామన్నారు నూతన జాతీయ విద్యా విధానం నరేంద్ర మోడీ ఖీఖీ భావాలను విద్యార్థులపై బలవంతంగా రుద్దే ఆలోచన విరమించుకోవాలి అన్నారు విదేశీ యూనివర్సిటీల అనుమతులు అంటే ఉన్న యూనివర్సిటీలను కనుమరుగు చేయడం అన్నారు, రైతుల నల్ల చట్టాలకు వ్యతిరేకంగా దేశ ప్రజానీకం ఏకం చేసి ఢిల్లీ నుంచి గల్లీ వరకు ఉద్యమాలకు నాయకత్వం వహించిన సంఘం ఏఐఎస్ఏ నే అన్నారు నేడు రైతులు మెడకు ఉరితాడుగా వచ్చిన మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలని ఏ ఐ ఎస్ ఏ రైతులకు అండగా పూర్తిగా సంఘీభావం తెలిపింది అన్నారు

## రెండు రోజుల పర్యటన నిమిత్తం జిల్లాకు రానున్న ముఖ్యమంత్రి

### జిల్లా కలెక్టర్

చిత్తూరు, అక్టోబర్ 08 శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 11 మరియు 12 వ తేదీలలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి చిత్తూరు జిల్లాకు రానున్నారని జిల్లా కలెక్టర్ యం. హరి నారాయణన్ నేడు ఒక ప్రకటన లో తెలిపారు. ఈ నెల తేది 11న సోమవారం మ.2.10 గం.లకు గన్నవరం నుండి బయలుదేరి మ. 2.55 గం.లకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు. తదుపరి మ. 3.30 గం లకు తిరుపతి లోని బర్డ్స్ ఆసుపత్రి చేరుకుని శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయం ఆసుపత్రి ప్రారంభోత్సవం, సా. 4.00 గం.లకు అలిపిరి శ్రీవారి పాదాలు చేరుకుని అలిపిరి మెట్ల మార్గాన్ని మరియు గో మందిరం ను ప్రారంభోత్సవం చేసి సా. 5.00 గం.లకు తిరుమల శ్రీ పద్మావతి అతిథి గృహం చేరుకుంటారు. సా. 5.50 గం. లకు బేడి ఆంజనేయ స్వామి ఆలయం చేరుకుని అక్కడి నుండి శ్రీవారికి పట్టు వస్త్రాలను తీసుకుని బయలుదేరి శ్రీవారికి సమర్పించి పూజా కార్యక్రమాల్లో పాల్గొని, రా. 7.15 గం. లకు తిరుమల శ్రీ పద్మావతి అతిథి గృహం చేరుకుని రాత్రి బస చేస్తారు. మంగళవారం తేది.12న ఉ.5.30 గం.లకు మరోమారు శ్రీవారిని దర్శించుకుని ఉ. 6.25 గం. లకు గొల్ల మండపం వద్ద నుండి ఎస్. వి. బి. సి. కన్నడ మరియు హింది ఛానల్ ను ప్రారంభించి, ఉ. 6.50 గం. లకు కొత్తగా నిర్మించిన బూందీ పోటును ప్రారంభిస్తారు.

ఉ.7.20 గం.లకు అన్నమయ్య భవన్ లో గౌ. ముఖ్యమంత్రికి టి. టి. డి. అమలు చేస్తున్న నూతన కార్యక్రమాలను వివరించి , టి టి డి మరియు రాష్ట్ర ప్రభుత్వ రైతు సాధికారక సంస్థ మధ్య చేసుకునే ఎం. ఓ. యు కార్యక్రమం లో పాల్గొననున్నారు. . ఉ. 8.05 కు పద్మావతి అతిథి గృహం చేరుకుని ఉ. 9 గం లకు తిరుమల నుండి బయలుదేరి 10.15 గం. లకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని ప్రత్యేక విమానంలో గన్నవరం తిరుగు ప్రయాణం కానున్నారని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## వాసవి సత్రం లో ఘనంగా వాసవి అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవములు

శ్రీశైలం అక్టోబరు 8, (న్యూస్ పల్స్) శ్రీశైలం స్థానిక వాసవి సత్రం నందు శ్రీశైల పట్టణ ఆర్యవైశ్య సంఘం మరియు యువజన సంఘం వారి ఆధ్వర్యంలో శరన్నవరాత్రి బ్రహ్మోత్సవములు రెండో రోజుకు చేరుకున్నాయి రెండో రోజు లో భాగంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి అమ్మవారు లక్ష్మీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. స్థానిక ఆర్యవైశ్యులు అందరూ కూడా కుటుంబ సమేతంగా విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని కుంకుమ పూజల్లో పాల్గొన్నారు పూజ అనంతరం సంఘం వారు భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ నవరాత్రి మహోత్సవాలను ప్రతి రోజు కూడా నిర్వహించువారు శ్రీశైల పట్టణ ఆర్యవైశ్య సంఘం చైర్మన్ అయితా మార్కండేయులు, ప్రెసిడెంట్ గ్రంధిశిల సుబ్బారావు, సెక్రెటరీ పొట్టి చిన్న సుబ్బయ్య, క్యాషియర్ అర్వపల్లి ప్రసాద్, ఉపాధ్యక్షులు నంబూరి వెంకట పుల్లయ్య మరియు శ్రీశైల పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులు మరియు వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## రైతులకు విద్యుత్ కష్టాలు

కోదాడ అక్టోబరు 8, (న్యూస్ పల్స్) నడిగూడెం మండల కేంద్రంలో విద్యుత్ అధికారుల అలసత్వం కారణముగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు... మండల కేంద్రానికి చెందిన కొంత మంది రైతుల విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ కాలి పోవడంతో పొలాల గుండా రైతులు కర్రల సహాయంతో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ను మోసుకెళ్తున్నారు...విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ కాలిపోయినపుడల్లా ఇలాంటి కష్టమే ఎదురావుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..విద్యుత్ శాఖ అధికారులకు విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ రహదారికి సమీపానికి మార్చాలని పలుమార్లు దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు..రహదారికి దగ్గరకు మార్చాలంటే రెండు లక్షలు ఖర్చు వస్తుందని అధికారులు చెప్పినట్లు రైతులు చెబుతున్నారు. అంత సొమ్ము చెల్లించలేక ఇలా కష్టాలు పడుతున్నారు.. అధికారులు నిర్లక్ష్యం వదిలి విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ను రహదారికి దగ్గర అమార్చలని రైతులు అభ్యర్థిస్తున్నారు...

## జగన్మాత ను బాలాత్రిపురసుందరి గా దర్శించుకోవడం నా పూర్వజన్మ సుకృతం

విజయవాడ అక్టోబరు 8, (న్యూస్ పల్స్)జగన్మాత ను బాలాత్రిపురసుందరి గా దర్శించుకోవడం నా పూర్వజన్మ సుకృతమని పర్యాటక శాఖామంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం అయన ఇంద్రకీలాదరిలో దుర్గమ్మను దర్శించుకున్నారు. మంత్రి మాట్లాడుతూ భవానీ మాల ప్రతీ సంవత్సరం వేసుకుంటాను. టెక్నాలజీ కి అందని విషయాలు చాలా ఉన్నాయి. అష్టాదశ శక్తి పీఠాలూ దర్శించుకోవడం నాకు అలవాటు. శక్తి అన్ని చోట్లా కొలువుండటంతో రాష్ట్రంలో కష్టాలు లేవు. కరోనా థర్డ్ వేవ్ రాకుండా చూడాలని అమ్మవారిని కోరుకుంటున్నా. అత్యధిక వ్యాక్సినేషన్, కరోనా టెస్టులు చేసిన రాష్ట్రం మనది. కొత్తగా ఏర్పడిన రాష్ట్రం అభివృద్ధి చెందేలా చేయాలని సీఎం కు అమ్మవారు శక్తినివ్వాలని కోరుకుంటున్నా. దసరా ఉత్సవాలు మైసూరు, విజయవాడలలో జరుగుతున్నాయని అన్నారు.

## చిట్టమూరు ఎంపీపీ పీఠం ను కైవసం చేసుకున్న సన్నా రెడ్డి శ్రీనివాసులు రెడ్డి

### చిట్టమూరు ఎంపీపీ పై వీడిన ఉత్కంఠ

### ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించిన సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి తల్లి విజయలక్ష్మి

నెల్లూరు అక్టోబర్ 08 నెల్లూరు జిల్లా,చిట్టమూరు మండల పరిషత్ అధ్యక్ష పదవిని మండల వైకాపా మండల కన్వీనర్ సన్నా రెడ్డి శ్రీనివాసులు రెడ్డి కైవసం చేసుకోవడం తో ఎంపీపి ఎన్నిక వివాదానికి ఎట్టికేలకు తెరపడింది. జిల్లాలోనే చిట్టమూరు ఎంపిపి అధ్యక్ష పీఠం వైసీపీ అధిష్టానంకు తలనొప్పిగా మారింది. వైకాపా అధిష్టానం వైసీపీ నేత దువ్వూరు శేషురెడ్డి కి బి ఫామ్ ఇవ్వడం, మెజారిటీ ఎంపిటిసి స్థానాలు సన్నారెడ్డి వైపు ఉండంతో ఇరువర్గాల మధ్య ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరుకుంది. మండలంలో ఒకే పార్టీలోని ఇద్దరు నాయకుల మధ్య నెలకొన్న ఆధిపత్య పోరుతో 2 పర్యాయాలు ఎంపిపి ఎన్నికను అధికారులు వాయిదా వేశారు. దింతో మండలం ఉత్కంఠగా ఎంపిపి అధ్యక్ష పీఠం పోరు నిలిచింది. అయితే ఎట్టకేలకు జరిగిన పోరులో అధిష్టానం సన్నా రెడ్డి వైపు మొగ్గు చూపి మరలా బి ఫారం సన్నా రెడ్డి చేతికి రావడంతో, వైకాపా మండల పార్టీ అధ్యక్షుడు సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి తల్లి సన్నారెడ్డి విజయలక్ష్మి ఎంపీపీగా ఎన్నికయ్యారు. చిట్టమూరు మండలంలో వైకాపాకు చెందిన 11మంది ఎంపిటిసిలు విజయలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైఎస్ ఎంపీపీగా బి .వి. రమణయ్య, కో ఆప్షన్ సభ్యునిగా మస్తాన్ సాహెబ్ ను ఎన్నుకున్నారు. ఈ మేరకు రిటర్నింగ్ అధికారి నూతన కమిటీ చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ మేరిగ మురళీధర్ నూతనకమిటీకిశుభాకాంక్షలను తెలియజేశారు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన వైకాపా నాయకులు, సన్నారెడ్డి కుటుంబ అభిమానులు సమక్షంలో శ్రీనివాసులురెడ్డి కి సత్కారాన్ని అందించారు. అభిమానులు శ్రీనివాసులురెడ్డిని తమ భుజాలపై మోసుకుంటు తమ అభిమానాన్నిచాటుకున్నారు. ఈ సందర్భంగా మేరిగా మురళీధర్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పార్టీలోని నాయకుల మధ్య చిన్న, చిన్న అపార్థాలు చోటు చేసుకున్నప్పటికి పార్టీ అధిష్టానం సూచనల మేరకు పనిచేయాల్సి ఉంటుందన్నారు. పార్టీలోని తమ తమ అభిప్రాయాలను వ్యక్తపరుచుకునే హక్కు ఉందన్నారు. అలాంటి సమయాల్లో వివాదాలుచోటు చేసుకోవచని అయినప్పుయికి పార్టీ నిర్ణయాలన్ని శిరసావహించడం జరుగుతుందన్నారు. ఇది ఇలా ఉంటే సన్నా రెడ్డి మొదటి నుండి వైసీపీ కోసం అహర్నిశలు శ్రమించారు. వైకాపా మండల కన్వీనర్ గా పనిచేస్తూ ,మండలంలో వైసీపీని బలోపేతం చేసేందుకు ఆయన ఎనలేని సేవలు చేశారు. పార్టీ కోసం కష్ట కాలంలో పనిచేసి స్థానిక పరిషత్ ఎన్నికల్లో 11 స్థానాల్లో 8 సన్నా రెడ్డి వర్గం కైవసం చేసుకోవడం ద్వారా న్యాయ బద్దంగా ఎంపిపి పదవీ తమకు రావాలి అనీ సన్నా రెడ్డి ఎనలేని రాజీలేని పోరాటం చేశారు. పట్టు వదలని విక్రమార్క్ గా సన్నా రెడ్డి నిలిచారు. సన్నా రెడ్డి పక్షాన మొదటి నుండి మేరిగా మురళీధర్ నిలవడం విశేషం. ఎంపిపి అధ్యక్ష ఎన్నికకు ఎమ్మెల్యే వెలగపల్లి రాకపోవడం పై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## సమాధులు ఆక్రమణ...

### ఆక్రమణ దారులపైన చర్యలు తీసుకోవాలి..

నందికొట్కూరు. అక్టోబర్ 08వాగులు, వంకలు, మురుగు నీటి కాలువలు ఆక్రమణ కు గురవుతున్నాయి. ఇవి చాలవు అన్నట్లు పూర్వీకుల సమాధులను సైతం భూకబ్జా దారులు వదలడం లేదు. ఆక్రమణకు పాల్పడిన వారి పై చర్యలు తీసుకోవాలసిన సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. నందికొట్కూరు మున్సిపాలిటీ లోని పగిడ్యాల రహదారి లో తిక్కమ్మ సమాదినీ భూకబ్జా దారులు కబ్జా చేసి కంచె ఏర్పాటు చేశారు. గత 30ఏళ్ళ క్రితం తిక్కమ్మ అను మతిస్తిమితం లేని మహిళా బిక్షాటన చేసుకుంటూ జీవనం సాగించేది. పట్టణ ప్రజలు ఆమెను దైవంగా భావించే వారు. కాలక్రమేణా ఆమె మృతి చెందడం వలన దాతలు రెండు సెంట్ల స్థలం కేటాయించి అంత్యక్రియలు నిర్వహించారు. అక్కడే ఉన్న దేవతకు నీలి శికారిలు ప్రతి ఏడాది జాతర లాగా నిర్వహిస్తారు. అయితే ఇప్పుడు ఆ స్థలం కబ్జా కు గురైంది. ఎవరు అక్రమించారో కూడా అధికారులకు తెలియకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## నందిగామ న విస్తృతంగా అన్య మత ప్రచారాలు

నందిగామ అక్టోబరు 8, (న్యూస్ పల్స్)కృష్ణా జిల్లా నందిగామ నియోజకవర్గ పరిధిలో విస్తృతంగా అన్య మత ప్రచారాలు ఉద్రికత్తను రేపాయి. ఈఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నందిగామ మండలం అనాసాగరం గ్రామంలో అన్యమత ప్రచారాన్ని అడ్డుకున్న స్థానికులు, వచ్చినవారిపై మండిపడ్డారు. క్రైస్తవుల కరపత్రాలు పుస్తకాలు తీసుకువచ్చి మతం అంటూ ఒత్తిడి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. స్థానికులు ఎదురు తిరగడంతో వారు పలాయనం చిత్తగించారు. మత ప్రచారం కోసం వచ్చిన వారిపై కుంకుమ చల్లి ఆగ్రహం వ్యక్తం చేసారు. అన్యమత ప్రచారం పై హిందూ ధర్మ పరిరక్షణ సమితి నిర్వాహకులు భగ్గుమంటున్నారు. కొద్ది రోజుల క్రితం నందిగామ ప్రాంతంలో ఒక పోలీస్ కానిస్టేబుల్ అన్యమత ప్రచారం చేయడం సంచలనం కలిగించింన విషయం తెలిసిందే. తాజాగా అనాసాగరం గ్రామంలో అన్యమత ప్రచారానికి వచ్చిన వాళ్ళని స్థానికులు పెద్ద ఎత్తున అడ్డుకుని ఊరి నుంచి పంపించివేశారు. సరిగ్గా హిందువుల పండుగలు సమయంలోనే అన్యమత ప్రచారం జరుగుతుంది. ర్యాలీ పేరు చెప్పి పోలీసులు వద్ద అనుమతులు పొంది అన్యమత ప్రచారానికి వచ్చారని తెలిసింది. ఇంటిలో మగవారు లేని సమయంలో ఆడవారిని మతం మారాలంటూ బైబిల్ పుస్తకాలు చేతిలో పెట్టి ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. ఇటువంటి వారికి అనుమతి ఇచ్చేటప్పుడు పోలీసులు ఒకసారి ఆలోచించాలని అన్నారు. వ్యాఖ్యలు చేస్తూ రాళ్లకు మొక్క వద్దు అంటూ ప్రచారం చేస్తున్నారు. కొందరు ఎస్సి సర్టిఫికేట్ తో ఉద్యోగాలు పొంది అన్యమత ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వము,ప్రభుత్వ అధికారులు నందిగామ ప్రాంతంలో జరుగుతున్న అన్యమత ప్రచారాల సంఘటనపై విచారణ జరపాలని డిమాండ్ చేసారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై ఈవో సమావేశం

తిరుమల,మా ప్రతినిధి,అక్టోబర్ 08, శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అక్టోబరు 11, 12వ తేదీల్లో ముఖ్యమంత్రి శ్రీ వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ శ్రీ హరినారాయణ్‌తో కలిసి టిటిడి ఈవో డాక్టర్ కెఎస్.జవహర్‌రెడ్డి శుక్రవారం తిరుమల అన్నమయ్య భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ముఖ్యమంత్రివర్యులు అక్టోబరు 11వ తేదీన మధ్యాహ్నం తిరుపతికి చేరుకుని తిరుపతిలోని బర్డ్ ఆసుపత్రిలో శ్రీ వేంకటేశ్వర పీడియాట్రిక్ కార్డియాక్ ఆసుపత్రిని ప్రారంభిస్తారని, ఆ తరువాత వరుసగా అలిపిరి కాలినడక మార్గం పైకప్పు, అలిపిరి పాదాల మండపం వద్దగల గోమందిరం ప్రారంభోత్సవాలు చేస్తారని వెల్లడించారు. అక్కడినుండి తిరుమలకు చేరుకుని సాయంత్రం శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. అక్టోబరు 12న ఉదయం శ్రీవారిని దర్శించుకుంటారని, ఆ తరువాత ఎస్వీబీసీ కన్నడ, హిందీ ఛానళ్లను, నూతన బూందీ పోటును ప్రారంభిస్తారని వివరించారు. తిరుపతిలో ముఖ్యమంత్రి పాల్గొనే ప్రారంభోత్సవాల ప్రదేశంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసు అధికారులతో సమన్వయం చేసుకోవాలని టిటిడి భద్రతా విభాగం అధికారులను ఆదేశించారు. అలిపిరి పాదాల మండపం, గోమందిరం వద్ద అదనపు ఈవో ఎవి.ధర్మారెడ్డి, జెఈవో సదా భార్గవి, బర్డ్ ఆసుపత్రిలో జెఈవో వీరబ్రహ్మయ్య ఏర్పాట్లను పర్యవేక్షిస్తారని చెప్పారు. ఆ తరువాత ముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమాలకు సంబంధించి తయారుచేసిన వీడియో క్లిప్‌లను ఈవో పరిశీలించి పలు మార్పులు చేశారు. శ్రీవారి ఆలయం వద్ద ఈవో తనిఖీలు అనంతరం ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఆయా ప్రాంతాలను శుక్రవారం ఈవో తనిఖీ చేశారు. శ్రీ బేడి ఆంజనేయస్వామివారి ఆలయం, మాడ వీధులు, గొల్లమండపం, బూందీ పోటు తదితర ప్రాంతాలను పరిశీలించారు.

## దుర్గగుడి వద్ద అన్యమత ప్రచారంపై దర్యాప్తు

విజయవాడ అక్టోబర్ 08 ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా హిందూ మత ప్రచారం కోసం ఏర్పాటు చేసిన ఎల్ఈడీ ప్రొజెక్టర్‌లో క్రైస్తవ ప్రార్థనల ప్రసారంపై ఈవో దృష్టి సారించారు. ఎల్ఈడీ ప్రొజెక్టర్‌లో క్రైస్తవ ప్రార్థనల ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉద్దేశపూర్వకంగా జరిందా? లేక పొరపాటున జరిగిందా? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఎల్ఈడీ ప్రొజెక్టర్‌లో క్రైస్తవ ప్రార్థనలు ప్రసారంపై వీహెచ్‌పీ తీవ్ర అభ్యంతరం తెలిపింది. అమ్మవారి భక్తులతో కలిసి దుర్గ గుడి ఈవోని కలిసి దీనికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఈవో.. భవిష్యత్‌లో ఇటువంటివి పునరావృతం కాకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

## అంబెద్కర్ భవనానికి నిధులు ఇవ్వండి

నెల్లూరు అక్టోబర్ 08 నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని దర్గామిట్ట లోని అంబేద్కర్ భవన్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని, బారాషాహీద్ దర్గా అభివృద్ధికి నిధులు కేటాయించాలని, నెల్లూరు రూరల్ లో షాదీ మంజిల్, క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని, రూరల్ నియోజకవర్గంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజి మంచినీటి పథకం కోసం ధ్వంసమైన రోడ్లు పునర్నిర్మించాలని, ఇది కాకుండా రూరల్ నియోజకవర్గంలో రోడ్లు, డ్రైన్ల నిర్మాణం కోసం 50 కోట్ల రూపాయల నిధులు కేటాయించాలని మునిసిపల్ శాఖామంత్రి బొత్సా సత్యనారాయణ ను రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ప్రత్యేకంగా కోరారు. రెండు నెలలో ధ్వంసమైన రోడ్లను పునర్నిర్మిస్తామని, మిగిలిన పనులకు కూడా నా వంతు సహకారం అందిస్తానని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కి మునిసిపల్ శాఖామంత్రి బొత్సా సత్యనారాయణ హమినిచ్చారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, అభివృద్ధి కార్యక్రమాల సాధన కోసం, ప్రజల పక్షాన ఎంతటి పోరాటానికైనా సిద్ధమని అన్నారు.

## మామిడి తోరణాలు లేవు

విజయవాడ అక్టోబరు 8, (న్యూస్ పల్స్) ఇంద్రకీలాద్రిలో అమ్మవారి దర్శనానికి రెండో రోజు కూడా వచ్చాం. ప్రముఖులు, తెలిసిన వాళ్ళకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారు. దసరా ఉత్సవాలలో పనులు చేసేవారికి సదుపాయాలు లేవని జనసేన అధికార ప్రతినిధి, పోతిన మహేష్ విమర్శించారు. దసరా రాష్ట్ర ఉత్సవం అయితే బడ్జెట్ ఎంత. ఇది రాష్ట్ర ఉత్సవమేనా.. 70 కోట్ల నిధులు ఎందుకు ఇంకా అమ్మవారి ఖాతాకి రాలేదు. రాష్ట్ర ఉత్సవంలా లేదు.. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉత్సవంలా రంగులేసారని ఆరోపించారు. అన్యమత ప్రచారం వైసీపీ నాయకులే నిన్న చేయించారు. ఆలయం ఏర్పాటు చేసిన స్క్రీన్స్ లో ఎలా అన్యమత ప్రచారం వచ్చింది. స్క్రీన్స్ కాంట్రాక్ట్ తీసుకున్న వ్యక్తి మీద చర్యలు తీసుకోవాలి. నలుగురు ఈఈ లు, ప్రిన్సిపల్ సెక్రెటరీ ఏం చేస్తున్నారు. ఇతర ఆలయాల ఈఓ లను నలుగురిని తీసుకొచ్చారు. ఉత్సవ శోభ ఏమైంది. ఐరన్ ఫ్రేం ఏమైంది.

## ఏరులై పారిన బీర్లు

అనంతపురం ఎక్కడైనా మద్యం ఏరులై పారుతుందని మాట తరచూ మనం వింటుంటాము.. కానీ ఇంతవరకు ఎవరూ చూసిఉండరు కదా అయితే ఈ సంఘటన చూస్తే మీరు కూడా అదే నిజం అంటారు. అనంతపురం జిల్లాలో ఒకటి కాదు రెండు కాదు ఏకంగా వేల సంఖ్యలో బీర్లు రోడ్డుపై పారపోశారు. అయ్యో అక్కడ మద్యం నిశేదం ఉందా ఏంటి అని అశ్చర్యపోకండి. పారపోసింది కూడా ప్రభుత్వ అధికారులే.. అలా అని అది అక్రమ మద్యం అసలే కాదు.. అనంతపురం నగర శివారులోని సోములదొడ్డి వద్ద ఉన్న ఐఎంఎల్ మద్యం డిపోలో కాలం చెల్లిన బీర్లు ఉన్నట్లు ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. బడ్ వైజర్ అనే బ్రాండ్ బాటిల్స్ ఎక్కువ మొత్తంలో కాలం చెల్లినవి ఉన్నట్లుగా తెలుసుకొని వాటిని ధ్వంసం చేశారు. వీటి విలువ సుమారు 5 లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు. 2272 కేసుల బీర్ బాక్సుల్లో ఉన్న 27,264 బాటిల్స్ కాలం చెల్లినవ గా గుర్తించారు. దీంతో వాటన్నింటినీ మొత్తం రోడ్డుపై పారబోసి ధ్వంసం చేశారు. ఈ సంఘటనతో బీరు కాస్త ఏరులై పొంగింది. సాధారణంగా బీర్ బాటిల్స్ కు ఆరు నెలల కాల వ్యవధి మాత్రమే ఉంటుందన్నారు. ఆరు నెలల తర్వాత కెమికల్ అయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు

## ఏపీని తాకట్టు పెట్టేస్తున్నారు

విజయవాడ, అక్టోబరు 8, (న్యూస్ పల్స్)జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జగన్ సర్కార్‌ను మరోసారి టార్గెట్ చేశారు. సోషల్ మీడియా వేదికగా విరుచుకుపడ్డారు. అప్పులు చేస్తున్నారంటూ మరింత ఘాటుగా విమర్శలు చేశారు. ఆంధ్రప్రదేశ్ తాకట్టులో ఉందంటూ వివరించే ప్రయత్నం చేశారు. 'ఎన్ని వాగ్దానాలు చేసినా .. ఎన్ని అరుపులు అరిచినా.. రాష్ట్ర బడ్జెట్టుని ఎంత మసి పూసి మారేడుకాయ చేసినా.. సంపాదన కన్నా ఎక్కువ ఖర్చుపెట్టలేరు. పండించిన దానికన్నా ఎక్కువ పంచలేరు. ఈ మౌలిక ఆర్థిక సూత్రాన్ని వైసీపీ ప్రభుత్వం మరిచినట్టుంది' అన్నారు. 'వైసీపీ ప్రభుత్వం పథకాల పేరుతో రాష్ట్ర ప్రజలకు ఉదారంగా ఇస్తున్నది రూపాయి అయితే.. ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ ప్రభుత్వం చేస్తున్న ఆర్థిక వద్ధి పావలా వంతు. విద్యుత్ బిల్లులు, నిత్యావసరాల ధరలు, ఇతర ధరల పెంపుతో ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూలు చేస్తున్నది రూపాయి బిల్లంత అయితే.. వైసీపీ ప్రభుత్వం భావితరాలకు ఇస్తున్న కానుక–అప్పులు, వడ్డీ, చక్రవడ్డీలు కొడిగుడ్డంత' అంటూ పవన్ ఎప్పుడు జీతాలు, పెన్షన్లు వస్తాయో తెలియదు. ఇందుకు కారణం రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ గాడి తప్పడమే ఇందుకు కారణం అంటూ ఆరోపించారు పవన్ కళ్యాణ్. రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు పెన్షన్లు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న విషయం తన దృష్టికి వచ్చిందని తెలిపారు.

## చిన్నశేష వాహనంపై గీతా కృష్ణుడి అలంకారంలో శ్రీ మలయప్పస్వామి

తిరుమల, అక్టోబర్ 08 శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు శుక్రవారం ఉదయం 9 నుండి 10 గంటల వరకు శ్రీవారి ఆలయంలోని కల్యాణ మండపంలో శ్రీ మలయప్పస్వామివారు ఐదు తలల చిన్నశేష వాహనంపై నెమలి పింఛం, పిల్లనగ్రోవి ధరించి గీతా కృష్ణుడి అలంకారంలో దర్శనమిచ్చారు. చిన్నశేష వాహనం – కుటుంబ శ్రేయస్సు పురాణ ప్రాశస్త్యం ప్రకారం చిన్నశేషుడిని వాసుకి(నాగలోకానికి రాజు)గా భావిస్తారు. శ్రీ వైష్ణవ సంప్రదాయానుసారం భగవంతుడు శేషి, ప్రపంచం శేషభూతం. శేషవాహనం ఈ శేషిభావాన్ని సూచిస్తుంది. చిన్నశేష వాహనాన్ని దర్శిస్తే కుటుంబ శ్రేయస్సుతోపాటు కుండలినీయోగ సిద్ధిఫలం లభిస్తుందని ప్రశస్తి. రాత్రి 7 నుంచి 8 గంటల వరకు హంస వాహనంపై స్వామివారు దర్శనమివ్వనున్నారు.

## ప్రజల క్షేమమే ప్రభుత్వ లక్ష్యం...మాజీ సర్పంచ్ హనుమంతు



తుగ్గలి అక్టోబర్ 8( విభారె) : రాష్ట్రంలో గల ప్రజల క్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మాజీ సర్పంచ్ శభాష్ పురం హనుమంతు తెలియజేసారు.గురువారం రోజున మండల పరిదిలోని శభాష్ పురం గ్రామం గ్రామ సచివాలయం నందు అధికారులు ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో గ్రామ సభను నిర్వహించారు.గ్రామ సర్పంచ్ పుష్పవతి, మరియు ఎంపీటీసీ రామాంజనమ్మ మరియు శభాష్ పురం గౌరవ సలహాదారుడు మాజీ సర్పంచ్ హనుమంతు అధ్యక్షతన అధికారులు గ్రామ సభను నిర్వహించారు.ఈ సందర్భంగా అదికారులు మాట్లాడుతూ నవరత్నాలలో భాగంగా రెవిన్యూ శాఖ తరుపున ఇస్తున్నటువంటి రేషన్ కార్డ్స్,ఇంటి పట్టాలు, జగనన్న శాశ్వతగా భూ హక్కు-భూ రక్ష పథకం, పట్టాదారు పాస్ బుక్స్ మొదలైన సంక్షేమ పథకాలను విఆరోఓ రామాంజినేయులు ప్రజలకు వివరించారు.అదేవిధంగా గ్రామాల అభివృద్ధి కొరకు ప్రత్యేక ప్రణాళికలు ఏర్పాటు చేసుకుని గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు తెలియజేశారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రతి ఒక్క పథకం గ్రామ వాలంటీర్లు మరియు గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూర్చాలని మాజీ సర్పంచ్ హనుమంతు తెలియజేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పుష్పవతి కు, ఎంపిటిసి రామాంజినమ్మ మరియు గ్రామ గౌరవ సలహాదారుడు శభాష్ పురం హనుమంతు కు అధికారులు శాలువాను కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పంచాయితీ సెక్రెటరీ రాముడు,వీఆర్వో రామాంజనేయులు,సీసీ శేఖర్,సచివాలయం సిబ్బంది,విఆర్ఏ శేఖర్,సందీప్,గ్రామ వాలంటీర్లు మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాల దొంగతనాలు పై జాగ్రత్త

విశాఖపట్నం జిల్లా డుంబ్రిగూడ ద్విచక్ర వాహనాల దొంగతనాలు పై ద్విచక్ర వాహనాల యజమానులు అప్రమత్తంగా ఉండాలని అలాగే వారి ద్విచక్ర వాహనాలు రోడ్డుపై పెట్టకుండా వారి

నివాస గృహాలలో ఉన్న గేటు లోపల గాని బయట ఉంచిన వారి వాహనాలనుఅండ్ బ్లాక్ ఏసి వాహనాలు ఉంచాలని అలాగే అప్రమత్తంగా ఉండాలని డుంబ్రిగూడ ఎస్ఐ సంతోష్ కుమార్ వాహనదారులకు సూచించారు

## బడుగుల(బిసి)పథకాల్లో భారీగా కోత

### అకారణంగా అర్హులైన లబ్ధిదారులను తొలగిస్తున్న వైకాపా ప్రభుత్వంనాటి ఎన్నికల హామీ ఏమైంది "తేదేపా" విమర్శ



బడుగు అక్టోబర్ 8( విభారె బలహీన(బిసి)వర్గాల సంక్షేమం కొరకు నిరంతరం పని చేస్తామని,వారి సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పిన వైకాపా ప్రభుత్వం నేడు ఆ సామాజిక వర్గాలకు చెందిన నాయి బ్రాహ్మణులు,రజకులు,టైలర్ల లబ్ధిదారులను అనేక సాకులు చూపి అకారణంగా "చేదోడు" పథకం నుంచి తొలగిస్తున్నారని తెదేపా బీసీనేత,ఆంధ్రప్రదేశ్ నాయిబ్రాహ్మణ సేవాసంఘం, రాష్ట్ర కార్యదర్శి, కొలవలి వేణుగోపాల్ ప్రభుత్వాన్ని విమర్శించారు శుక్రవారం ఉదయం బద్వేల్ నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో వేణుగోపాల్ మాట్లాడుతూ.......ఎన్నికల మ్యానిఫెస్టో అంటే తమకు భగవద్గీత,ఖురాన్,బైబిల్ తో సమానమని,అందులో చెప్పిన వాగ్దానాలను తప్పక నెరవేరుస్తామని చెప్పిన వైకాపా ప్రభుత్వం నేడు బలహీన వర్గాలకు చెందిన లబ్ధిదారులను ఏదు గజాల సొంత ఇల్లు ఉన్నదని,300 రూపాయలు విద్యుత్ బిల్లు వస్తుందని, రైతుభరోసా, ప్రభుత్వ పెన్షన్ లలో లబ్ధిదారులుగా ఉన్నారని సాకులు చూపిస్తూ ఆకారణంగా అర్హత కలిగిన నిజమైన పేద లబ్ధిదారులను తొలగిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారునాడు ప్రతిపక్ష నాయకుడి హోదాలో పాదయాత్ర సందర్భంగా నాయిబ్రాహ్మణులు,రజకులు బడుగు బలహీన వర్గాలు తమను ఆదరిస్తే ఆయా సామాజిక వర్గాలకు తగిన గుర్తింపు,గౌరవం ఇస్తానని, తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులుగా, శాసనమండలి( ఎమ్మెల్సీ) సభ్యులుగా అవకాశమిచ్చి గౌరవిస్తానని చెప్పినటువంటి నాయకుడు నేడు "మాట తప్పారని, మడమ తిప్పారని" ఆయన గుర్తు చేశారు బడుగు బలహీన వర్గాలకు చెందిన నాయిబ్రాహ్మణులు, రజకుల అభివృద్ధి తెలుగుదేశం ప్రభుత్వంలోనే సాధ్యమని అన్నారుఎంతోమంది పేద నాయిబ్రాహ్మణులు,రజకులు 15 మంది కలసి గ్రూపుగా ఏర్పడి ప్రభుత్వానికి సబ్సిడీ రుణం మంజూరు కొరకు దరఖాస్తు చేసుకున్నట్లయితే వెంటనే ప్రభుత్వం సబ్సిడీ రుణాలను సామాజిక వర్గ గ్రూపుల వారీగా మంజూరు చేసేదని అన్నారుతద్వారా ఎంతో మంది నిరుద్యోగ యువతీ, యువకులు ప్రభుత్వ సబ్సిడీ రుణాలు తీసుకుని వ్యాపార అభివృద్ధి చెందారని ఆయన గుర్తుచేశారు నేడు వైకాపా ప్రభుత్వంలో అలాంటి ప్రభుత్వ పథకాలను రద్దు చేయడం జరిగిందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్స్ కేవలం అలంకార ప్రాయంగా మారయని ఆవేదన వ్యక్తం చేశారుసమావేశంలో బద్వేలు పట్టణ నాయిబ్రాహ్మణసంఘ నాయకులు బద్వేల్ బాబు, ఎన్,సురేష్ బాబు పాల్గొన్నారు

## వాసవి మాతాకు విశేష పూజలు

దర్శి అక్టోబర్ 8( విభారె-దసరా నవరాత్రి ఉత్సవాలు లో భాగంగా ప్రకాశం జిల్లా దర్శి లో వేంచేసి ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం లో వేకువ జాము నుండి అమ్మవారి కి పంచామృత అభిషేకం తో విశేష పూజలు జరిగినవి. శుక్రవారం శ్రీ బాల త్రిపుర సుందరి దేవి అలంకరణ తో 11 మంది దంపతులు తో అమ్మవారికి విశేష పూజలు జరిపారు.తదుపరి ఆలయపూజారి భక్తులు కు తీర్ధ ప్రసాదాలు అందచేశారు. కోవిడ్ నిబంధనలు ఉన్నందు వలన భక్తులు సామాజిక దూరం పాటిస్తూ మాస్క్ లు ధరించి పూజలు నిర్వహించడం జరిగింది.ఆలయ యాజమాన్యం వారు భక్తులు కు సకల సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం లో మహిళలు అధిక సంఖ్య లో పాల్గొని తమ ఆరాధ్య దేవత ను మనసారా దర్శించి తమ కోర్కెలు ని విన్నవించు కొన్నారు.

## ఇన్ఫార్మర్ సినిమా ప్రేక్షకుల ఆదరణ పొందాలిహీరో హీరోయిన్ గా వినోద్ రెడ్డి రుచిత



ఎమ్మిగనూరుఅక్టోబర్ 8( విభారె వీవర్స్ కాలని షూటింగ్ ప్రారంభంక్లాప్ కొట్టి షూటింగ్ ను ప్రారంభించిన జగన్ మోహన్ రెడ్డినందవరం (అక్టోబర్ 7 మా ప్రతినిధి న్యూస్). ఎమ్మిగనూరు నియోజకవర్గంలో యశోద ఎంటర్ టైన్మెంట్స్ వై ఉమాదేవి క్రియేషన్స్ బ్యానర్ పై తెరకెక్క నున్న ఇన్ఫార్మర్ చిత్రం ప్రేక్షకుల ఆదరణ పొందాలని ఎమ్మిగనూరు వైకాపా సీనియర్ నేత ఎర్రకోట జగన్ మోహన్ రెడ్డి ఆకాంక్షించారు.శుక్రవారం ఎమ్మిగనూరు పట్టణం వీవర్స్ కాలనిలోని ఓ ఇంటిలో కొత్త సినిమా ఇన్ఫార్మర్ షూటింగ్ సనివేశాన్ని జగన్ మోహన్ రెడ్డి క్లాప్ కొట్టి ప్రారంభించారు. ముందుగా ప్రత్యేక పూజలు చేపట్టారు. శ్రీ నీలకంటేశ్వర స్వామి క్రియేషన్స్ అధినేతలు ప్రముఖ సినీ నిర్మాతలు అగ్రహారం నాగిరెడ్డి సంజీవ రెడ్డి రూపా జగదీష్, కరణం దేవేందర్ రెడ్డి (జయ సూర్య సినిమా నిర్మాత) సమక్షంలో సినిమా షూటింగ్ ప్రారంభమైంది. యశోద ఎంటర్ టైన్మెంట్స్ క్రియేషన్స్ బ్యానర్ పై నిర్మిస్తున్న ఇన్ ఫార్మర్ చిత్రానికి నిర్మాతగా అగ్రహారం నాగిరెడ్డి వై ఉమాదేవి హీరోగా అగ్రహారం వినోద్ రెడ్డి హీరోయిన్ గా బెంగళూరు కు చెందిన రుచిత ,రచయిత గా గురు తేజ , దర్శకుడు గా విఎన్ వసంత్ కుమార్ వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాలో నటించేందుకు కొత్త వారికి అవకాశం కల్పిస్తున్నట్లు దర్శకుడు నిర్మాతలు తెలిపారు. ఈ సందర్భంగా జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ సినీ రంగంలో రాయలసీమ నుండి దర్శకులు నిర్మాతలు హీరో హీరోయిన్ నటులుగా ఎదగడం సంతోషకరం. జయ సూర్య ,తెనాలి రామకృష్ణ, బుజ్జి ఇలా రా, సినిమాలు తెరకెక్కించిన అనుభవం జీ నాగేశ్వర రెడ్డి అగ్రహారం నాగి రెడ్డి రూపా జగదీష్ దేవేందర్ రెడ్డి సంజీవ రెడ్డి లకు ఉందన్నారు. స్థానిక కళాకారులలో దాగిఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయడానికి ఇటువంటి చిన్న సినిమాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు.

## మారని ఎన్టీఆర్ లుక్ .. షాక్ అవుతున్న ఫ్యాన్స్!



ఎన్టీఆర్ .. చరణ్ ప్రధాన పాత్రధారులుగా 'ఆర్ ఆర్ ఆర్' రూపొందుతోంది. కొమరం భీమ్ గా ఎన్టీఆర్ .. అల్లూరి సీతారామరాజుగా చరణ్ ఈ సినిమాలో కనిపించనున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న వీరి అభిమానులు ఈ సినిమా విడుదల తేదీ కోసం ఎంతో ఆత్రుతతో .. ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. రాజమౌళి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను జనవరి 7వ తేదీన విడుదల చేయనున్నట్టు ఇటీవల ప్రకటించారు. దాంతో షూటింగు పార్టు పూర్తయి ఉంటుందని అంతా అనుకున్నారు. కానీ ఎన్టీఆర్ ఇంకా కొమరం భీమ్ లుక్ తోయినే ఉండటం చూసి అభిమానులు షాక్ అవుతున్నారు.ఇటీవల తూర్పు గోదావరి జిల్లా 'రాజోలు' గ్రామానికి చెందిన కొప్పాడి మురళి అనే వ్యక్తి రోడ్డు ప్రమాదం కారణంగా హాస్పిటల్ పాలయ్యాడు. కొన్ని రోజులుగా ఆయనకి అక్కడ ట్రీట్మెంట్ జరుగుతోంది. అయితే ఆయన రెండు కిడ్నీలు పూర్తిగా దెబ్బతినడం వలన కోలుకునే అవకాశాలు తగ్గుతూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన మనసులోని బలమైన కోరిక ఏదో తెలుసుకుని నెరవేర్చడానికి వైద్యులు ప్రయత్నించారు. దాంతో తాను ఎన్టీఆర్ అభిమానిననీ .. ఆయనతో మాట్లాడాలని ఉందని మురళి చెప్పాడట. వెంటనే వైద్యులు అందుకు తగిన ఏర్పాట్లు చేశారు.తన అభిమాని చివరి కోరిక గురించి తెలుసుకున్న ఎన్టీఆర్ వెంటనే వీడియో కాల్ చేసి అతనితో మాట్లాడాడు. త్వరలోనే కోలుకుంటావంటూ ఆయనకి మనోధైర్యాన్ని చెప్పాడు. అయితే ఎన్టీఆర్ ఆ వ్యక్తితో వీడియో కాల్ మాట్లాడుతుండగా హాస్పిటల్లో ఎవరో వీడియో తీశారు. అది ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ వీడియోలో ఎన్టీఆర్ ఇంకా కొమరం భీమ్ లుక్ తోనే కనిపిస్తుండటం అందరికీ ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. 'ఆర్ ఆర్ ఆర్' షూటింగు జరుగుతూనే ఉందా? ఇంకా పూర్తికాలేదా? అనే చర్చలు జోరందుకుంటున్నాయి.అయితే రాజమౌళి తన సినిమాల చిత్రీకరణకు ఎక్కువ సమయాన్ని తీసుకుంటాడనే విషయం తెలిసిందే. కథాకథనాలను రెడీ చేసుకోవడానికీ .. గ్రాఫిక్స్ వర్క్ ను దృష్టిలో పెట్టుకుని షాట్స్ రెడీ చేసుకోవడానికి ఆయన చాలా సమయం తీసుకుంటాడు. ఇక ఒక్కోసారి అవసరమైతే రీ షూట్ల కోసం కూడా వెళుతుంటాడు. ఆయన ప్రతి సీన్ ను చెక్కుతాడనీ .. అందుకే ఆయనను తాను 'జక్కన్న' అని పిలుస్తుంటానని ఒక సందర్భంలో ఎన్టీఆర్ అన్నాడు. ఇప్పుడు కూడా అలాంటి వర్క్ ఏదో జరుగుతూ ఉండొచ్చు. ఇక ఈ సినిమా తరువాత కొరటాల ప్రాజెక్టు పైకి ఎన్టీఆర్ వెళ్లనున్న సంగతి తెలిసిందే.కొరటాల సినిమా అనగానే బలమైన కథాకథనాలు .. ఆ రెండింటి మధ్య బలంగా అల్లుకున్న సందేశం కనిపిస్తుంది. ఇంతవరకూ ఆయన తన ప్రతి సినిమా ద్వారా ఏదో ఒక సందేశాన్ని అందిస్తూ వచ్చాడు. 'ఆచార్య' కూడా సందేశాన్ని ఇస్తూనే నడుస్తుంది. అలాగే ఎన్టీఆర్ చేయనున్న సినిమా కూడా వినోదం పాళ్లు ఎంతమాత్రం తగ్గకుండా నడుస్తుందట. ఇంతకుముందు ఈ కాంబినేషన్లో వచ్చిన 'జనతా గ్యారేజ్' భారీ విజయాన్ని నమోదు చేసింది. ఆ తరువాత వస్తున్న ఈ సినిమాపై సహజంగానే అంచనాలు ఉన్నాయి. త్వరలోనే సెట్స్ పైకి వెళ్లనున్న ఈ సినిమాలో కథానాయికగా రష్మిక పేరు వినిపిస్తుండటం విశేషం.

## హీరోగా రాఘవేంద్రరావు అల్లరి .. నలుగురు హీరోయిన్ల సందడి!

తెలుగు సినిమా కథకు .. పాటకు రొమాంటిక్ పాఠాలు నేర్పిన దర్శకుడు రాఘవేంద్రరావు. ఆయన కెమెరా కన్ను నుంచి హీరోయిన్ల అందాలు తప్పించుకోలేవు. కథలో పడి కొట్టుకుపోతున్న ప్రేక్షకుడికి ఆయన అరగంటకోసారి ఓ రొమాంటిక్ సాంగ్ ను అందిస్తూ ఆదుకుంటారు. ఆ పాట వాళ్లపై ఒక ఎనర్జీ డ్రింక్ లా పనిచేస్తూ ఉంటుంది. సాధారణంగా థియేటర్లకు వచ్చే వాళ్లలో మాస్ ఆడియన్స్ ఎక్కువగా ఉంటారు. అందువలన ఆయన తన కథలో .. పాటల్లో రొమాన్స్ ఉండేలా చూసుకుంటారు.హీరోయిన్లతో సౌందర్య శిల్పాలను తలపించే భంగిమలు పెట్టించడం .. పాలరాతి సొగసులపై పాలతో అభిషేకాలు చేయించడం .. హీరోయిన్ ను



తలపులతో తడిపేస్తూ పూల వాన .. తేనె వాన .. పండ్ల వాన కురిపించడం .. పాల పాత్రల్లో పండ్లు వచ్చిపడటం .. నేరుగా చెప్పలేని భావాలను సింబాలిక్ గా చూపించి ఆ అనుభూతిని ప్రేక్షకుడి ఊహకు వదిలేయడం ఆయన ప్రత్యేకత. హీరోయిన్లను ఆయన అంతటి అందంగా ఎవరూ చూపించలేరనే అభిమానుల అభిప్రాయం ఇప్పటికీ చెక్కుచెదరలేదు. అందువల్లనే ఆయన సినిమాల్లో తప్పకుండా నటించాలని హీరోయిన్లు కలలు కనేవారు.రాఘవేంద్రరావు సినిమాల్లో శృంగారం పాళ్లు కాస్త ఎక్కువగానే కనిపిస్తాయి .. వినిపిస్తాయి. డైలాగుల్లోను .. సన్నివేశాల్లోను .. పాటల్లోను ఎక్కడ అవకాశం చిక్కితే అక్కడ రొమాన్స్ చొరబడిపోతూనే ఉంటుంది. వాటిని మాస్ ఆడియన్స్ ఒక రేంజ్ లో ఎంజాయ్ చేసేవారు. ఇక ఆయన సినిమాల్లో ఇద్దరు ముగ్గురు హీరోయిన్లు ఉండేవారు. ప్రేక్షకులకు బోర్ కొట్టకుండా ఉండటం కోసం .. గ్లామర్ కోటా పెంచడం కోసం ఆయన అలా చేసేవారు. అలా ఒక హీరో చుట్టూ ముగ్గురు నలుగురు హీరోయిన్లను ప్రదక్షిణలు చేయించిన రాఘవేంద్రరావు ఇప్పుడు తాను హీరోగా మారిపోయారు .. నలుగురు హీరోయిన్లతో సందడికి సిద్ధమైపోతున్నారు.అవును .. 'పెళ్లి సందఆ' సినిమాలో ఒక ముఖ్యమైన పాత్రను పోషించిన రాఘవేంద్రరావు ఇప్పుడు హీరోగా మారిపోయారు. కథ అంతా కూడా ఆయన చుట్టూనే తిరుగుతుందట. ఈ సినిమాకి దర్శకుడు తనికెళ్ల భరణి. అలాగని చెప్పేసి ఇది 'మిథునం' టైపు సినిమా కాదు .. నలుగురు హీరోయిన్లు ఉంటారట. ఒక్కసారే చెబితే కోలుకోవడం కష్టమని వాళ్లెవరన్నది నిదానంగా చెబుతారట. తనికెళ్ల భరణి మనసుకి తగినట్టు .. రాఘవేంద్రరావు వయసుకి తగినట్టుగానే ఈ సినిమా ఉంటుందని అనుకోవాలంతే.ఇప్పటికైతే స్క్రిప్ట్ వర్క్ పూర్తయింది. త్వరలోనే సెట్స్ పైకి తీసుకుకెళ్లడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమా ముహూర్తం సెట్ చేసుకుంటూ ఉండగానే రాఘవేంద్రరావు తను హీరోగా మరో ప్రాజెక్టును సెట్ చేసుకున్నారు. ఈ సినిమాకి వీఎన్ ఆదిత్య దర్శకత్వం వహించనున్నారు. రాఘవేంద్రరావు కోసం ఆయన సిద్ధం చేసిన కథ కూడా చాలా డిఫరెంట్ గా ఉంటుందని అంటున్నారు. తనికెళ్ల భరణి దర్శకత్వం వహిస్తున్న సినిమా పూర్తయిన తరువాత ఈ సినిమా మొదలుకానుంది. మొత్తానికి రాఘవేంద్రరావు ఈ విషయంలోను తన రూటే వేరు అన్నట్టుగా దూసుకుపోతుండటం విశేషం.

## 'స్పిరిట్' లో పోలీస్ ఆఫీసర్ గా ప్రభాస్..?

పాన్ ఇండియన్ స్టార్ వరుస సినిమాలు అనౌన్స్ లైన్ లో పెడుతూ అభిమానులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. లేటెస్టుగా ప్రభాస్ ల్యాండ్ మార్క్ సిల్వర్ జూబ్లీ మూవీ చఖతీజీఎష్ట్రజీబ25 కు సంబంధించిన అధికారిక అనౌన్స్ మెంట్ ఇచ్చారు. 'అర్జున్ రెడ్డి' ఫేమ్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కనుంది. దీనికి "స్పిరిట్" అనే టైటిల్ ను మేకర్స్ కన్ఫర్మ్ చేసినట్లు ప్రకటించారు.'స్పిరిట్' సినిమా గురించి ప్రభాస్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. "సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో చేయనున్న 'స్పిరిట్' తో నా ప్రయాణం కిక్ స్టార్టింగ్" అని డార్లింగ్ పేర్కొన్నారు. "ఇది నా 25వ చిత్రం. దీన్ని జరుపుకోవడానికి ఇంతకంటే మంచి మార్గం లేదు. అద్భుతమైన కథాంశంతో రూపొందనున్న ఈ చిత్రంలో పని చేయడానికి వేచి ఉండలేను. ఇలాంటి అవతారంలో నన్ను చూడటానికి అభిమానులు






ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు" అని ప్రభాస్ తన సిల్వర్ జూబ్లీ ప్రాజెక్ట్ గురించి తెలిపారు.'స్పిరిట్' సినిమాలో ఇప్పటి వరకు అభిమానులు కనీసం ఊహించనటువంటి సరికొత్త పాత్రలో ప్రభాస్ ను సందీప్ రెడ్డి వంగా చూపించబోతున్నారని చిత్ర బృందం ప్రకటించింది. దీంతో డార్లింగ్ పాత్ర ఏమయ్యుంటుందని అందరిలో ఆసక్తి ఎక్కువైంది. ఈ నేపథ్యంలో ప్రభాస్ ఇందులో ఓ పోలీస్ ఆఫీసర్ గా కనిపించనున్నాడని టాక్ నడుస్తోంది. 'స్పిరిట్' టైటిల్ లోగో లో రెండు పోలీస్ బ్యాడ్జ్ 'స్టార్స్' ఉండటం కూడా ఈ ఊహాగానాలకు మరింత బలాన్ని చేకూరుస్తోంది.ఇదే కనుక నిజమైతే డార్లింగ్ ఫ్యాన్స్ కి కన్నుల పండుగే అని చెప్పవచ్చు. ఎందుకంటే ప్రభాస్ ఇంతవరకూ పోలీస్ పాత్రలో కనిపించడంలేదు. ఇప్పుడు 'స్పిరిట్' చిత్రంలో ఖాకీ డ్రెస్ వేయడానికి రెడీ అయ్యారని అంటున్నారు. ఇందులో నిజమెంతో తెలియాలంటే మేకర్స్ నుంచి క్లారిటీ వచ్చే వరకు ఆగాల్సిందే.పాన్ ఇండియా స్థాయిలో రూపొందనునున్న ఈ చిత్రాన్ని టి సిరీస్ - యూవీ క్రియేషన్స్ మరియు సందీప్ వంగా సొంత నిర్మాణ సంస్థ భద్రకాళి పిక్చర్స్ కలిసి భారీ బడ్జెట్ తో నిర్మించబోతున్నాయి. భూషణ్ కుమార్ - వంశీ - ప్రమోద్ - వంగా ప్రణయ్ రెడ్డి దీనికి నిర్మాతలుగా వ్యవహరించనున్నారు. 'స్పిరిట్' చిత్రాన్ని తెలుగు తమిళం మలయాళం హిందీ కన్నడ మండరిన్ జపనీస్ మరియు కొరియా భాషల్లో తెరకెక్కించనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. వచ్చే ఏడాది సందీప్ రెడ్డి - ప్రభాస్ ప్రాజెక్ట్ సెట్స్ పైకి వెళ్లే అవకాశం ఉంది. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే వెల్లడి కానున్నాయికాగా యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన పీరియాడికల్ లవ్ డ్రామా 'రాధే శ్యామ్' ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. రాధా కృష్ణ కుమార్ తెరకెక్కించిన ఈ సినిమా వచ్చే ఏడాది సంక్రాంతి పండుగ సందర్భంగా జనవరి 14న రిలీజ్ కానుంది. ఇక ప్రభాస్ 'సలార్' తో పాటుగా సమాంతరంగా 'ఆదిపురుష్' షూటింగ్ కూడా చేస్తున్నారు. బాలీవుడ్ దర్శకడు ఓం రౌత్ డైరెక్ట్ చేస్తున్న 'ఆది పురుష్' లో ఆయన రాముడిగా కనిపించనున్నారు. 2022 ఆగస్ట్ 11న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

## ఎస్ఆర్హెచ్ గెలవడానికి ఆడాలి.. అతడికి ఫేర్వెల్ కోసం కాదు!



: ఐపీఎల్-2021 సీజన్లో సన్రైజర్స్ హైదరాబాద్ దారుణంగా విఫలమైంది. ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన తొలి జట్టుగా అపఖ్యాతి మూటగట్టుకుంది. ఇప్పటి వరకు ఆడిన 13 మ్యాచ్లలో కేవలం మూడే మ్యాచ్లు గెలిచిన ఎస్ఆర్హెచ్.. శుక్రవారం తమ చివరి మ్యాచ్ ఆడబోతోంది. డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్తో తలపడబోతోంది. ఇందులో గెలిస్తే.. ముంబై ప్లే ఆఫ్స్(సాంకేతికపరమైన అవకాశాలు) ఆశలకు గండికొట్టి.. పరువు నిలుపుకోవడమే తప్ప పెద్దగా సాధించేదేమీ లేదు.ఈ నేపథ్యంలో సన్రైజర్స్ ప్లేయర్ డేవిడ్ వార్నర్ గురించి ఆసక్తికర చర్చ నడుస్తోంది. వచ్చే సీజన్లో ఎలాగో వార్నర్ ఆరెంజ్ ఆర్మీలో ఉండడనే సంకేతాలు ఉన్నాయి.. కాబట్టి.. ఒకప్పటి(2016) టైటిల్ విన్నింగ్ కెప్టెన్ను చివరి మ్యాచ్ అయినా ఆడనివ్వాలని అభిమానులు కోరుతున్నారు. ఈ క్రమంలో టీమిండియా మాజీ క్రికెటర్, వ్యాఖ్యాత గౌతమ్ గంభీర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. గెలవడానికి మ్యాచ్లు ఆడాలే తప్ప వ్యక్తులకు ఫేర్వెల్ ఇవ్వడానికి కాదంటూ ఘాటుగా విమర్శించాడు.ఈ మేరకు ఈఎస్పీఎన్క్రిక్ఇన్ఫో చాట్లో గంభీర్ మాట్లాడుతూ... "చాలా మంది గొప్ప గొప్ప ఆటగాళ్లకే వీడ్కోలు మ్యాచ్లు ఆడే అవకాశం రాలేదు. మనందరికీ తెలుసు... కొంతమంది లెజెండ్స్కు కూడా ఈ ఛాన్స్ మిస్సయింది. అసలు 'ఫేర్వెల్ మ్యాచ్'ల వ్యవస్థ ఏమిటో నాకైతే ఏమీ అర్థం కావడం లేదు. ఎవరైనా గెలుపే అంతిమ లక్ష్యంగా మ్యాచ్ ఆడతారు. తుదిజట్టులో అత్యుత్తమ ఫామ్లో ఉన్న పదకొండు మంది ఆటగాళ్లలో అతడూ ఒకడైతే కచ్చితంగా ఆడతాడు. అంతేగానీ.. అతడికి తుదిజట్టులో చోటు ఇవ్వాలనే నిబంధనేం లేదు కదా. కాబట్టి.. సన్రైజర్స్ మ్యాచ్ గెలవాలి.. కానీ ఫేర్వెల్ ఇవ్వడానికి పరిమితం కాకూడదు" అని వార్నర్ను ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యలు చేశాడు.ఇక తుదిజట్టు ఎంపిక గురించి తన అభిప్రాయం పంచుకుంటూ.. రాయల్ చాలెంజర్స్ బెంగళూరును ఓడించిన జట్టుతోనే ముందుకు వెళ్తే బాగుంటుందని సూచించాడు. "ఆర్సీబీ మాదిరే ముంబైపై కూడా అదే జట్టుతో ఆడవచ్చు. భువీ(భువనేశ్వర్ కుమార్) గత మ్యాచ్లో మెరుగ్గా రాణించాడు. అతడికి ఉమ్రాన్ మాలిక్ కూడా తోడయ్యాడు. రషీద్ ఖాన్ కూడా ఉన్నాడు. ఆర్సీబీపై గెలవలేరు అనుకున్న మ్యాచ్లో వారు గెలిచి చూపించారు. ముంబై విషయంలోనూ అదే తరహాలో ముందుకు సాగాలి" అని గంభీర్ చెప్పుకొచ్చాడు.

## ఘనంగా దీపక్ చాహర్ లవ్ ప్రపోజల్ సెలబ్రేషన్స్.. ధోని, రైనా హంగామా చూడండి

చెన్నై సూపర్కింగ్స్ ఆటగాడు దీపక్ చాహర్.. గురువారం పంజాబ్ కింగ్స్తో మ్యాచ్ అనంతరం తన నెచ్చెలి జయా భరద్వాజ్కు లైవ్లో ప్రేమను వ్యక్తపరిచిన విషయం తెలిసిందే. అనంతరం సీఎస్కే యాజమాన్యం ఈ లవ్ జంట కోసం అదిరిపోయే పార్టీని అరేంజ్ చేసింది. తొలుత వీరిరువురు కేక్ను కట్ చేసి ఒకరికొకరు తినిపించుకోగా.. ఆ తర్వాత అసలు సిసలైన సెలబ్రేషన్స్ స్టార్ట్ అయ్యాయి. ధోని నేతృత్వంలో రైనా, జడేజా, శార్దూల్ ఠాకూర్, రాబిన్ ఊతప్పలు చాహర్ను కేక్, డ్రింక్స్తో ముంచెత్తారు. ఈ వేడుకల్లో ధోని, రైనాల కూతుళ్లు తెగ సందడి చేయగా, ధోని భార్య సాక్షి.. జయా భరద్వాజ్ను హత్తుకుని విష్ చేసింది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**